# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక





సంపుటి :13 సంచిక :5 బుధవారం 9-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




02

## కష్టాల్లో సౌత్ జోన్

- విజృంభించిన షమీ, ముఖేష్
- పోరాడుతున్న తిలక్ వర్మ
- పడిక్కల్ హాఫ్ సెంచరీ
- మూడో రోజూ ఈస్ట్ జోన్ దే జోరు
- సౌత్ జోన్ తో దులీప్ ట్రోఫీ ఫైనల్

### వైసీపీ సీనియర్ నేత బొత్స మేనల్లుడు

# చిన్న శ్రీను టీడీపీలో చేరిక

## ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుమార్తెతో సహా పార్టీలో చేరిక

- వైసీపీ నుంచి టీడీపీలోకి ఇంకా వస్తారు...టీడీపీలో చేరిన అనంతరం చిన్న శ్రీను సంచలన వ్యాఖ్యలు
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడి
- చిన్న శ్రీను వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో వలసలపై కొత్త చర్చ



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంగళవారం ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. వైసీపీ నుంచి ఇంకా చాలామంది నేతలు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా

మంగళవారం నాడు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చిన్న శ్రీను, ఆయన కుమార్తె సిరి సహస్ర టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బేబినాయన, అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు వంటి పలువురు ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ..

రాష్ట్రంలో గత రెండేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగు పెడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, విజయనగరం జిల్లా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతూ ఏపీని ప్రథమ స్థానంలో నిలబెట్టే వారి ప్రయత్నంలో నేను కూడా భాగస్వామిని కావాలనుకుంటున్నాను. ఈ అభివృద్ధి యజ్ఞంలో పాలుపంచుకోవాలనే తపనతోనే టీడీపీలో చేరాను" అని వివరించారు. ఇంకా వస్తారు.. చాలామంది వస్తారు" భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ముందు జగన్‌కు స్వాగతం పలికిన మీరు, ఇంత సడన్‌గా పార్టీ మారడానికి కారణమేమిటని విలేకరులు ప్రశ్నించగా.. గత రెండేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగం కావాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని బదులిచ్చారు. "వైసీపీ నుంచి ఇంకా ఎవరైనా వస్తారా?" అన్న ప్రశ్నకు, "ఇంకా వస్తారు.. చాలామంది వస్తారు" అని ఆయన నొక్కి చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాకు వెళ్లాక మరిన్ని విషయాలు పూర్తిస్థాయిలో వెల్లడిస్తానని తెలిపారు




## మంత్రుల శాఖలన్నీ మార్చాలని సూచించా

- క్యాబినెట్ విస్తరణపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం
- నన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలా? వద్దా? అధిష్ఠానమే నిర్ణయిస్తుంది
- పీసీసీ అధ్యక్షుడిగా నా బాధ్యతలు కొనసాగుతున్నాయి
- శాఖల మార్పుపై సీఎం, అధిష్ఠానం నిర్ణయం
- పార్టీని సమర్థంగా నడపడమే నా లక్ష్యం
- బీసీ నాయకుడే సీఎం అవుతారు
- కాంగ్రెస్‌లోనే బీసీ సీఎం సాధ్యం: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్,

: ప్రస్తుత రాష్ట్ర క్యాబినెట్‌లోని మంత్రుల శాఖలన్నింటినీ మార్చాలని తాను కాంగ్రెస్ అధిష్ఠానానికి సూచించానని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. క్యాబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా తానూ చేయాల్సింది, సూచించాల్సింది అంతవరకేనని పేర్కొన్నారు. మిగిలిన నిర్ణయాలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. క్యాబినెట్ విస్తరణ లేదా శాఖల కేటాయింపు అనేది పూర్తిగా అధిష్ఠానం పరిధిలోని అంశమని చెప్పారు. తనను మంత్రివర్గంలోకి తీసుకోవాలా? వద్దా? అనే విషయాన్ని పూర్తిగా అధిష్ఠానానికే వదిలేశామని అన్నారు. ప్రస్తుతం తనకు పార్టీని నడిపించే అత్యంత బాధ్యతాయుతమైన పీసీసీ

-మిగతా 2 లో



## కొత్త మ్యాప్‌లో భారత్‌కు ఐరాస బిగ్ షాక్..!

- కొత్త ప్రపంచ మ్యాప్‌లో భారత్‌కు షాక్
- అరుణాచల్, అక్సాయ్‌చిన్ ప్రత్యేక ప్రాంతాలుగా చిత్రీకరణ
- పీఓకే, కాశ్మీర్ సరిహద్దులపై వివాదాస్పద సూచనలు
- దేశ సరిహద్దుల రూపురేఖల్లో మార్పులపై కలకలం
- అరుణాచల్‌కు నాగాలాండ్ సరిహద్దు తొలగింపు
- అక్సాయ్‌చిన్‌ను స్వతంత్ర విభాగంగా చూపింపు
- కాశ్మీర్‌పై నియంత్రణ రేఖను చుక్కల గీతతో సూచన
- క్షేత్రస్థాయి వాస్తవాలను వక్రీకరిస్తే తీవ్ర నిరసన: భారత్
- జమ్మూకాశ్మీర్, లడఖ్, అక్సాయ్‌చిన్, అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమే

న్యూఢిల్లీ

దాదాపు 500 ఏళ్ల తర్వాత ప్రపంచ మ్యాప్ ను సవరించేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితిలో ఓ తీర్మానం ఆమోదించారు. దీనికి భారత్ కూడా మద్దతిచ్చింది. అయితే ప్రస్తుతం భారత్ మ్యాప్ లో ఉన్న ప్రాంతాలన్నీ యథాతథంగా ఉండాలని ఆ తర్వాత కోరింది. అయితే తాజాగా ఐరాస విడుదల చేసిన మ్యాప్ లో మాత్రం భారత్ కు గట్టి షాక్ తగిలింది. దీనికి కారణం భారత్ భూభాగమైన అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి పలు ప్రాంతాలు ఇప్పుడు ఈ మ్యాప్ లో కనిపించడం లేదు.

-మిగతా 2 లో

## ప్రధాని భద్రతలో కలకలం

- మోదీ ముంబయి పర్యటనకు ముందు అనూహ్య ఘటనలు
- వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరిగిన ఇద్దరి అరెస్ట్
- ఒకరి వద్ద నకిలీ పీఎంవో ఐడీ కార్డు
- మరో వ్యక్తి వద్ద తుపాకీ స్వాధీనం
- పోటోకాల్ డ్రిల్ వేళ అప్రమత్తమైన భద్రతా సిబ్బంది
- నిందితుడిని రోహన్ పరేఖ్‌గా గుర్తించిన పోలీసులు
- బీకేసీ మాల్ ఘటనలో మరో ముగ్గురి అరెస్ట్
- మాల్ ఘటనకు మోదీ కార్యక్రమంతో సంబంధం లేదన్న పోలీసులు



02

## అంగన్‌వాడీ పాఠశాలలు, వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనం, రేషన్ పంపిణీ పకడ్బందీగా అమలు చేయాలి




07

### మీ తల్లిని కాదు..నా తల్లిని

# అన్నారు

### ఆవేశం మీకు కాదు.. నాకుండాలి

### హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం



- మహిళా ఎమ్మెల్యేలపై దాడికి సమాధానం చెప్పాలన్న బీఆర్ఎస్
- ఘటనపై పూర్తి నివేదిక కోరామన్న శ్రీధర్ బాబు
- నివేదిక వచ్చిన తర్వాత చర్యలుంటాయన్న స్పీకర్
- స్పీకర్ పై వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్
- స్పీకర్ అంటే తమకు చాలా గౌరవం ఉందన్న హరీశ్ రావు
- తాతా మధు స్పీకర్ ను ఉద్దేశించి అలా మాట్లాడలేదు
- స్పీకర్ అలా భావిస్తే విచారం వ్యక్తం చేస్తున్నామన్న హరీశ్
- పోలీసులపై కేటీఆర్ దాడి చేశారన్న మంత్రి సీతక్క
- ఈ వివాదాలను ఇంతటితో ఆపాలన్న ఏలేటి
- శాసన సభలోవాడీ వేడి చర్చ

హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనలపై మంగళవారం కూడా సభలో వాగ్యుద్ధం జరిగింది. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి అంటూ..ఒక దశలో స్పీకర్ ప్రసాద్‌కుమార్.. హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో రోజు సభ ప్రారంభమైన వెంటనే నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిన పోలీసులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా దీన్ని పరిగణిస్తున్నామన్నారు. "

-మిగతా 2 లో




### వృద్ధ ఎస్టీ మహిళపై

## సీఐ దురుసు ప్రవర్తన..

- ఏపీ ఎస్టీ కమిషన్ సీరియస్!
- ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్..
- జిల్లా ఎస్పీ సైతం సమగ్ర విచారణకు ఆదేశం
- విచారణ నివేదిక అనంతరం శాఖాపరమైన చర్యలు
- బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్

**చీరాల,(బాపట్ల జిల్లా),ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** బాపట్ల జిల్లా చీరాల పట్టణం లోని ఆదినారాయణపురంలో కార్డెన్ సెర్చ్ సందర్భంగా వృద్ధ ఎస్టీ మహిళ పట్ల చీరాల రెండో పట్టణ సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుపై వివాదం తీవ్ర రూపం దాల్చింది. సీఐ దురుసుగా వ్యవహరించిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ వ్యవహారం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సుమోటోగా స్వీకరించడం చర్చనీయాంశంగా మారింది.

**సీఐ ప్రవర్తనపై జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశం**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల ఎస్‌డీపీవో ఎం.డి. మొయిన్ ఘటనపై విచారణ చేపట్టనున్నారు.


-మిగతా 2 లో



02

## పొగ తాగకపోయినా బలవుతున్నారు!

- పరోక్ష ధూమపానంతో పెరుగుతున్న ముప్పు
- 33 ఏళ్లలో 50 శాతం పెరిగిన మరణాలు
- 2023లో 44.4 కోట్ల మందిపై ప్రభావం
- పిల్లల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు
- 3.25 లక్షలకు చేరిన మరణాలు
- గుండె, శ్వాసకోశ వ్యాధుల ముప్పు అధికం
- 204 దేశాల్లో అధ్యయనం చేసిన పరిశోధకులు



02

### బ్రిక్స్‌లో భారత్

## కొత్త ఎజెండా

- వాణిజ్యం నుంచి ఏఐ వరకు ఫోకస్
- 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు
- 11 సభ్య దేశాలతో విస్తరించిన బ్రిక్స్‌కు భారత్ నాయకత్వం
- ఇంధన భద్రత, వాతావరణ మార్పులు,. అభివృద్ధి ఫైనాన్స్‌పైనా చర్చలు

## కొత్త మ్యాప్‌లో భారత్‌కు ఐరాస బిగ్ షాక్..!

మొదటి తరువాయి

ఐరాసలో ఆఫ్రికన్ యూనియన్ ప్రతిపాదించిన కరెక్ట్ ది మ్యాప్ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపినప్పటికీ, ఈ కొత్త మ్యాప్ లో దేశ సరిహద్దులను వివాదాస్పదంగా చూపించడం కలకలం రేపుతోంది. ముఖ్యంగా భారత్ అంతర్భాగంగా భావించే అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్, చైనా సరిహద్దుల మధ్య ఉన్న ప్రత్యేక స్వతంత్ర సరిహద్దు ప్రాంతాలుగా చూపించడం వివాదానికి దారితీసింది. ఈ కొత్త పటంలో ఈ రెండు ప్రాంతాల అంతర్గత రూపురేఖలను మార్చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కు నాగాలాండ్ తో ఉన్న సరిహద్దును తొలగించి, దాన్ని కేవలం అస్సాం, చైనా సరిహద్దులతో ముడిపడి ఉన్న స్వతంత్ర ప్రాంతంగా చూపించారు. అలాగే అక్సాయ్ చిన్ ను కూడా పశ్చిమాన భారత్ తో, తూర్పున చైనాతో సరిహద్దులు కలిగిన స్వతంత్ర విభాగంగా ప్రతిపాదించారు. అయితే ఈ సరిహద్దు మార్పులకు గల కారణాలను ఐక్యరాజ్యసమితి ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అలాగే జమ్మూ కాశ్మీర్ అంశాన్ని కూడా ఐరాస ప్రస్తావించింది. భారత్, పాకిస్తాన్ మధ్య ఉన్న నియంత్రణ రేఖను చుక్కల గీతతో సూచించింది. కాశ్మీర్ తుది స్థితిపై ఇరు దేశాల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదని మ్యాప్ దిగువన ఒక గమనిక ద్వారా పేర్కొంది. దీనిపై భారత్ స్పందిస్తూ.. క్షేత్రస్థాయి వాస్తవాలను ఏ రూపంలో తప్పుగా చూపించే ప్రయత్నాలనైనా తీవ్రంగా నిరసిస్తామని స్పష్టం చేసింది. దీనిపై స్పందించిన భారత్.. జమ్మూ కాశ్మీర్, లడఖ్, అక్సాయ్ చిన్ తో పాటు అరుణాచల్ ప్రదేశ్ భారత్ లో అంతర్భాగమని పునరుద్ఘాటించింది.

## మంత్రుల శాఖలన్నీ మార్చాలని సూచించా

మొదటి తరువాయి

అధ్యక్ష పదవి ఉన్నదని, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతారని, అది కాంగ్రెస్‌లోనే సాధ్యమని వ్యాఖ్యానించారు.

## ప్రధాని భద్రతలో కలకలం

ముంబై



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముంబయి పర్యటన నేపథ్యంలో కీలక పరిణామం జరిగింది. మోడీ పాల్గొనే కార్యక్రమం వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, ఒక తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో ప్రధాని రాకకు ముందే ముంబయిలో హై అలర్ట్ ప్రకటించారు. సోమవారం రాత్రి భద్రతా దళాలు ప్రోటోకాల్ డ్రిల్ నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది.

మంగళవారం సాయంత్రం ముంబయిలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోడీ పాల్గొనాల్సి ఉంది. అయితే, వేదిక వద్ద ప్రధాన మంత్రి కార్యాలయానికి చెందిన అధికారిగా చెప్పుకుంటూ తిరుగుతున్న వ్యక్తులు బీకేసీలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లోకి ప్రవేశించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది వారిద్దరి అనుమానాస్పద ప్రవర్తనను గమనించి అడ్డుకున్నారు. వారివద్ద ఉన్న ఐడీ కార్డులను తనిఖీ చేసి నకిలీవని గుర్తించారు. అనంతరం వారిద్దరిని ముంబయి పోలీసులకు అప్పగించారు. అనుమానితుడిని రోహన్ పరేఖ్‌గా పోలీసులు గుర్తించారు.

'షాపింగ్? మాల్' ఘటనకు మోడీ ఈవెంట్'కు సంబంధం లేదు'

ఇదిలా ఉండగా, ముంబయిలో బీకేసీలో ఉన్న ఒక షాపింగ్ మాల్‌లోకి తుపాకీతో ప్రవేశించడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అయితే, ఈ ఘటన సోమవారమే బీకేసీలోని 'జియో వరల్డ్ ప్లాజా'లో జరిగిందని, దీనికి ప్రధాని కార్యక్రమంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఓ అధికారి తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం షాపింగ్ ప్లాజాలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లోకి గుర్తుతెలియని ముగ్గురు అనుమానితులు ప్రవేశించడానికి యత్నించారు. భద్రతా సిబ్బంది వారిని అడ్డుకోగా, వారు అనుమానాస్పదంగా ఉన్న ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించి, గార్డులతో వాదించి, బలవంతంగా లోపలికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాల్ సెక్యూరిటీని తుపాకీ చూపించి బీకేసీలోని జియో వరల్డ్ ప్లాజాలోకి బలవంతంగా ప్రవేశించారు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిందితులను అరెస్టు చేశారు. అయితే, నిందితుల వద్ద లభించిన ఆయుధానికి లైసెన్స్ ఉన్నట్లు తేలిందని, ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తును ముమ్మరం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## 4 నెలల్లో 23 మందికి ఉరిశిక్ష!

యూపీలో ఓ ఫాస్ట్‌ట్రాక్ జడ్జి రికార్డు

ముజఫర్‌నగర్(యూపీ), సెప్టెంబర్ 8



నాలుగు నెలల్లో 23వ ఉరిశిక్షను ఒక వరకట్న మరణ కేసులో విధించిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ పిరికి న్యాయమూర్తి అని పిలిపించుకోవడం కంటే చావే మేలని అన్నారు. వరకట్నం కోసం తన భార్యను తగలబెట్టిన నదీమ్‌కు మరణశిక్ష విధిస్తూ మాఫియాలు, గ్యాంగ్‌స్టర్లు లేదా నేరస్థుల ఒత్తిడికి లొంగిపోయి తాను తన న్యాయ విధులను నిర్వర్తించబోనని జడ్జి చెప్పారు.ఫాస్ట్-ట్రాక్ కోర్టు జడ్జి మాట్లాడుతూ దేవుడికి తప్ప మరెవరికీ భయపడకూడదని తన తల్లిదండ్రులు తనకు నేర్పించారని, బలవంతులు, మాఫియాలు, గ్యాంగ్‌స్టర్లు లేదా నేరస్థులకు భయపడి వ్యవహరించడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. పిరికివాడైన న్యాయమూర్తిగా ముద్రపడటం కంటే మరణించడమే మేలని, తన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయగలిగినంత కాలం తన విధులను కొనసాగిస్తానని దివాకర్ పేర్కొన్నారు.

## కలియుగ దుశ్శాసనుడు రేవంత్

మొదటి తరువాయి

దళితులపై కాంగ్రెస్‌కు నిజంగా ప్రేముంటే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఏమైంది..? అంబేద్కర్ విగ్రహానికి తాళాలెందుకు వేశారు? అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని పోలీసులు పరిశీలిస్తారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడం ఆక్షేపణీయమని మండిపడ్డారు. సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై దాడి ఘటనలో ఎలాంటి విచారణ జరుపకపోవడం బాధాకరమని విమర్శించారు. స్పీకర్ అంటే ఎంతో గౌరవమున్నదని, వ్యక్తిగతంగా ఉన్న అభిమానం స్పీకర్ మనసుకూ తెలుసునని పేర్కొన్నారు. తాతామధు స్పీకర్‌ను ఏం అనలేదని, ఒకవేళ నొచ్చుకొని ఉంటే పార్టీ తరఫున కూడా విచారం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.ావస్త్రఅంశ్రీఫ్అజవ దీత్షుఅష్త్ర

కేసీఆర్ ఇంటిపై దాడి వికృత చర్య

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై కాంగ్రెస్ శ్రేణుల దాడి వికృత చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. జవహర్‌నగర్ పీఎస్ వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలు బట్టబయలవుతాయనే సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని దుయ్యబట్టారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ మీడియాతో చిట్‌చాట్ చేసి మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరుగలేదనడం ఏంది? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులు తీసుకువెళ్తే అడ్డుకోలేదని, తాము టీ షర్ట్‌లు వేసుకుంటే అడ్డుకున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ మైత్రీ బంధానికి ఇదే నిదర్శనమని స్పష్టంచేశారు. రాష్ట్రానికి హోంమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై దాడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకొ ని రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరారు. రాష్ట్ర పరిస్థితులపై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు

# కష్టాల్లో సౌత్ జోన్

- విజృంభించిన షమీ, ముఖేష్
- పోరాడుతున్న తిలక్ వర్మ
- పడిక్కల్ హాఫ్ సెంచరీ
- మూడో రోజు ఈస్ట్ జోన్ దే జోరు
- -- సౌత్ జోన్ తో దులీప్ ట్రోఫీ ఫైనల్



చెన్నై:

ఈస్ట్ జోన్ తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ-2026 ఫైనల్లో సౌత్ జోన్ కష్టాల్లో పడింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ జోన్ మొదటి ఇన్నింగ్స్ లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. సారథి ఇషాన్ కిషన్ (270) విధ్వంసకర డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన సౌత్ జోన్.. మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ప్రస్తుతం సౌత్.. ఈస్ట్ టీమ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. కెప్టెన్ తిలక్ వర్మ (56 బ్యాటింగ్; 133 బంతుల్లో 5 ఫోర్లు) పోరాడుతున్నాడు. అంతకుముందు దేవదత్ పడిక్కల్ (62; 104 బంతుల్లో 4 ఫోర్లు) కీలకమైన అర్ధ శతకం చేసి అవుటయ్యాడు. పడిక్కల్, తిలక్ మినహా మిగతా బ్యాటర్లందరూ విఫలమయ్యారు. ఈస్ట్ బౌలర్లలో స్టార్ పేసర్లు మహమ్మద్ షమీ (2/17), ముఖేష్ కుమార్ (2/36) వికెట్లతో విజృంభించి బౌలింగ్ చేశారు.

ఆదుకున్న దేవదత్..

మంగళవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ రికీ భుయ్ (1) ను ప్రత్యర్థి బౌలర్ ముఖేష్ కుమార్ తక్కువ స్కోరుకే పెవిలియన్ కి పంపించాడు. దీంతో ఈస్ట్ జోన్ కేవలం 10 స్కోరుకే తొలి వికెట్ కోల్పోయింది. ఈ దశలో వన్ డౌన్ లో వచ్చిన దేవదత్ పడిక్కల్ సూపర్ బ్యాటింగ్ తో సౌత్ ఇన్నింగ్స్ ను ఆదుకున్నాడు. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్ తో కలిసి స్కోరు బోర్డును ముందుకు సాగించాడు. పడిక్కల్ కాస్త ఆచితూచి ఆడినా.. జగదీశన్ మాత్రం వరుస బౌండరీలతో చెలరేగాడు. ఈ క్రమంలోనే వీరు రెండో వికెట్ కు 60 పరుగుల భాగస్వామ్యం ఏర్పరుచుకున్నారు. అయితే, ఈ దశలో పుంజుకున్న ఈస్ట్ బౌలర్ శిఖర్ మోహన్ అదిరే బంతితో జగదీశన్ (32) ను ఇంటిబాట పట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన షేక్ రషీద్ తో కలిసి పడిక్కల్ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే బాధ్యతగా ఆడుతున్న దేవదత్ 65 బంతుల్లో 4 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ కొద్దిసేపటికే ముఖేష్ కుమార్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించిన పడిక్కల్ 62 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద దాస్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అదే సమయంలో మరో సెట్ బ్యాటర్ రషీద్ (27) ను షమీ అదిరే బంతితో ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి సౌత్ జోన్ కు ఇంకో భారీ షాకిచ్చాడు. ఈ కఠిన సమయంలో మైదానంలోకి అడుగుపెట్టిన సారథి తిలక్ వర్మ చిరస్మరణీయ బ్యాటింగ్ తో ఆదుకునే ప్రయత్నం చేశాడు. రవిచంద్రన్ స్మరణ్ (55 బంతుల్లో 23) తో కలిసి 5వ వికెట్ కు 45 పరుగులు జోడించాడు. అనంతరం కుదురుగా ఆడుతున్న రవిచంద్రన్ ను కూడా షమీ పెవిలియన్ కి పంపాడు. 174 స్కోరుకే కీలకమైన 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయిన సౌత్ ను తిలక్ వర్మ కెప్టెన్ ఇన్నింగ్స్ తో ఆదుకున్నాడు. ఒకవైపు వరుసగా వికెట్లు పడుతున్నా అతడు మాత్రం ప్రత్యర్థి బౌలర్లకు చెమటలు పట్టిస్తూ కీలకమైన పరుగులతో సత్తా చాటాడు. శ్రేయస్ గోపాల్ (26) తో కలిసి ఆరో వికెట్ కు 66 పరుగుల కీలకమైన భాగస్వామ్యాన్ని ఏర్పరిచాడు. అనంతరం భురేషి బౌలింగ్ లో గోపాల్ వెనుదిరిగినా.. తిలక్ మాత్రం బాధ్యతగా ఆడుతూ 123 బంతుల్లో 5 ఫోర్ల సహాయంతో అర్ధ శతకం సాధించాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ 80 ఓవర్లలో 242/6 స్కోరు నమోదు చేసింది. తిలక్ వర్మ (56), సీవీ మిలింద్ (2) అజేయంగా క్రీజులో ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. మోహన్, భురేషి తలో వికెట్ దక్కించుకున్నారు

## వృద్ధ ఎస్టీ మహిళపై సీఐ దురుసు ప్రవర్తన..

మొదటి తరువాయి

విచారణలో వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించనున్నారు. విచారణ నివేదిక అందిన అనంతరం తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.


**కార్డెన్ సెర్చ్‌లో అసలేం జరిగింది?**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెప్టెంబర్ 6న జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదినారాయణపురంలో నాటుసారా తయారీ, గంజాయి విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పేరం విజయ్, కార్తీక్‌లపై క్రిమినల్ కేసులు, నాటుసారా విక్రయ కేసులు, పోక్సో కేసులు ఉన్న నేపథ్యంలో వారి ఇళ్లు, పరిసరాలను తనిఖీ చేసేందుకు సీఐ శశికుమార్ సిబ్బందితో వెళ్లినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధ మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వడానికి నిరాకరించి, తనిఖీలకు సహకరించలేదని, దీంతో సీఐ దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం అందిందని ఎస్పీ కార్యాలయం పేర్కొంది.

**వైరల్ వీడియోపై ఏపీ "ఎస్టీ" "కమిషన్" సీరియస్**

ఇదే ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది. వృద్ధ ఎరుకుల (ఎస్టీ) మహిళ పట్ల చీరాల రెండో పట్టణ సీఐ



GOVERNMENT OF ANDHRA PRADESH
AP STATE COMMISSION FOR SCHEDULED TRIBES

From
Sri K. Rama Seshu,
Secretary,
AP ST Commission,
VIJAYAWADA.

To
The Superintendent of Police,
Bapatla District,
Bapatla.

Lr.No:3634/JA/Chairman-Sumoto/2026, Dt:07.09.2026

Sir,

Sub: AP State Commission for Scheduled Tribes - The Chairman, AP State ST Commission, Vijayawada - Complaint against the Sation House Officer, II Town Police Station, Chirala due to alleged misconduct towards an elderly ST Woman - Immediate take necessary action against the Police officer- Submit detailed report - Regarding.

Ref: Arising.

***

I invite your kind attention to the subject and reference cited above.

It is submitted that public dissatisfaction had been expressed regarding the functioning of the police administration in Chirala Police Division. It was alleged that certain police officials were not treating members of the public, activists and journalists properly. An incident involving an elderly woman belonging to the ST Erukula community was reported at Ramnagar during a cordon search on 06-09-2026, wherein the Chirala II Town CI was alleged to have behaved improperly and used offensive language towards her. A video of the incident was reportedly circulated on social media, causing concern among the public.

It is further alleged that persons questioning illegal sand mining and exploitation of natural resources were facing pressure, threats and criminal cases. There were also allegations of police officials being in connivance with persons involved in illegal sand transportation. Similar allegations regarding the conduct of police officials had reportedly been raised in the past. The report also raised concerns regarding the supervision of the Chirala DSP and the implementation of friendly policing. Therefore, it was suggested that the competent authorities verify the allegations, conduct an impartial inquiry and take appropriate action as per law.

In view of the seriousness of the allegations, the Chairman took suo motu cognizance of the matter and decided to call for a factual report from the concerned authorities regarding the alleged conduct of the police officials towards the elderly ST woman. The matter be examined based on the report, and appropriate action be taken as per law.

Yours faithfully
for Secretary
AP State ST Commission

Copy to. The Chairman Table.

ఏపీ ఎస్టీ కమీషన్ జారీ చేసిన లేఖ

అనుచితంగా ప్రవర్తించి, అభ్యంతరకరమైన భాష ఉపయోగించారన్న ఆరోపణలపై వాస్తవ నివేదిక సమర్పించాలని బాపట్ల జిల్లా ఎస్పీని కమిషన్ లేఖ ద్వారా కోరింది.

పోలీసుల తీరుపై గత ఆరోపణలపైనా కమిషన్ దృష్టి

చీరాల పోలీస్ డివిజన్‌లో కొంతమంది పోలీసు అధికారులు ప్రజలు, కార్యకర్తలు, జర్నలిస్టులతో సక్రమంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు కూడా కమిషన్ దృష్టికి వచ్చినట్లు లేఖలో పేర్కొన్నారు. అలాగే అక్రమ ఇసుక తవ్వకాలు, సహజ వనరుల దోపిడీని ప్రశ్నిస్తున్న వారిపై ఒత్తిళ్లు, బెదిరింపులు, క్రిమినల్ కేసులు పెడుతున్నారన్న ఆరోపణలు, అక్రమ ఇసుక రవాణాదారులతో కొంతమంది పోలీసు అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలను కూడా కమిషన్ ప్రస్తావించింది.

**ఇక విచారణ నివేదికపైనే ఉత్కంఠ..?**

ఒకవైపు వృద్ధ ఎస్టీ మహిళ పట్ల సీఐ ప్రవర్తనపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ సుమోటోగా విచారణకు దిగడం.. మరోవైపు బాపట్ల జిల్లా ఎస్పీ స్వయంగా స్పందించి ఎస్‌డీపీవో స్థాయి అధికారితో సమగ్ర విచారణకు ఆదేశించడం పోలీసు శాఖలో ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణలో ఏం తేలనుంది? సీఐ శశికుమార్‌పై ఎలాంటి శాఖాపరమైన చర్యలు ఉండనున్నాయి? అన్నది ఇప్పుడు చీరాలలో ఆసక్తికరంగా మారింది.

## పొగ తాగకపోయినా బలవుతున్నారు!



న్యూఢిల్లీ: భారత్‌లో పరోక్ష ధూమపాన మరణాలు 1990తో పోలిస్తే 2003 నాటికి 50శాతం మేరకు పెరిగాయి. 2023లో భారత్‌లో 44.4 కోట్ల మంది పరోక్ష ధూమపానానికి గురైనట్లు ప్రపంచవ్యాప్త విశ్లేషణ వెల్లడించింది. ఆరోగ్యపరంగా పిల్లలకు ఇది గణనీయమైన ముప్పును కలిగిస్తున్నది. 1990లో పరోక్ష ధూమపానానికి గురైన వారి సంఖ్య 37.5 కోట్లుగా ఉండగా, 2023 నాటికి అది 44.4 కోట్లకు పెరిగిందని లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైన విశ్లేషణ తెలియజేసింది.గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్'(జీబీడీ) 2023 సెకెండ్ హ్యాండ్ స్మోక్ కొలాబరేషన్'గా ఏర్పడిన అంతర్జాతీయ పరిశోధకుల బృందం 204 దేశాల్లో పరోక్ష ధూమపానానికి గురయ్యే స్థాయి, దాని వల్ల కలిగే వ్యాధుల భారాన్ని అంచనా వేసింది. భారత్‌లో 1990లో పరోక్ష ధూమపానం కారణంగా నమోదైన మరణాలు 2,17,700 కాగా, 2023లో అవి 3,25,600కు పెరిగాయి. పరోక్ష ధూమపానానికి గురికావడం వల్ల గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యలు సహా పలు వ్యాధుల ముప్పు పెరుగుతుందని ఢిల్లీకి చెందిన ప్రముఖ వైద్యురాలు నీతూజైన్ 'పీటీఐ'కి తెలిపారు.

## బ్రిక్స్‌లో భారత్ కొత్త ఎజెండా

న్యూఢిల్లీ



వాణిజ్యం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)వరకు బ్రిక్స్ వేదికగా భారత్ తన ఎజెండాను ప్రపంచం ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది. బ్రిక్స్ కూటమికి 2026లో అధ్యక్షత వహిస్తున్న భారత్ ఈనెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ శిఖరాగ్ర సదస్సును నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణం, అంతర్జాతీయ పాలనలో మార్పులపై కీలక చర్చలు జరపనుంది. అదే సమయంలో బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే థీమ్‌ను భారత్ ఎంచుకుంది. సంక్షోభాలను తట్టుకునే ఆర్థిక వ్యవస్థలు, కొత్త సాంకేతికత, దేశాల మధ్య సహకారం, సుస్థిర అభివృద్ధి, ఆ నాలుగు అంశాల చుట్టూ బ్రిక్స్ సదస్సును ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. దీనికి హ్యూమానిటీ ఫస్ట్ అనే దృక్పథాన్ని జోడించింది.బ్రిక్స్‌లో భారత్ ప్రధానంగా ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలను తగ్గించడం, అంతర్జాతీయ చెల్లింపులను సులభతరం చేయడం ఇందులో కీలకం. జాతీయ కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను మరింత అనుసంధానం చేయడం వంటి అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో ఎదురవుతున్న భౌగోళిక, రాజకీయ సవాళ్ల నేపథ్యంలో సరఫరా గొలుసులను మరింత పటిష్ఠం చేయడం భారత్ ఎజెండాలో ముఖ్యమైన అంశం. అంతేకాక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా బ్రిక్స్ సహకారం అందించాలనేది లక్ష్యం. ఇందుకోసం ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ విధానం, ఎంఎస్‌ఎంఈల కోసం ప్రత్యేక సహకార పోర్టల్ వంటి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది

## మీ తల్లిని కాదు..నా తల్లిని అన్నారు

మొదటి తరువాయి

కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ.. కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు.. కాంగ్రెస్ పార్టీకి పడుతుంది" అని తీవ్రంగా విమర్శించారు.

స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని.. హరీశ్‌రావు వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. "మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా.. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. నాకున్న ఎనిమిది మంది అక్కా చెల్లెళ్లతో పాటు వారు కూడా తన సోదరీమణులేనని పేర్కొన్నారు. మహిళా సభ్యులపై దురుసు ప్రవర్తనకు సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టంచేశారు.శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... మహిళా సభ్యులపై జరిగిన ఘటనపై రిపోర్ట్ ఇవ్వాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారని వివరించారు. మహిళల పట్ల గౌరవం మాకూ ఉందన్నారు. తప్పు జరిగితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్‌ఎస్ సభ్యులు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. స్పీకర్‌ను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సభను ఎలా నడపాలనే అంశంపై బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు అని చెప్పడానికి వాళ్లెవరు..?అని ప్రశ్నించారు. అనుకుంటే.. భావిస్తే ఏంటి.. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది కదా?అని హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు... మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఆదేశించారు.. స్పీకర్‌పై జరిగినదాన్ని పక్కనపెట్టాలని చెప్పటంతోనే ఆ ఘటనను వీరు ఎంత లైట్‌గా తీసుకుంటున్నారో అర్థమవుతుందని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని బీఆర్‌ఎస్ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ను దూషించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ గేట్ దగ్గర మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టింది ఎవరూ.. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్‌ను ఆయన తల్లిని దూషించి ఇప్పుడు లేదని దబాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులపై దాడులు చేయడం సబబేనా అనినిలదీశారు. అసెంబ్లీలో రూల్ తెచ్చిందే మీరు.. మీరే పాటించరా అని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లకారం భాషతో సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇక, తమ చీర లాగారు.. కొట్టారని బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చెబుతున్నారు.. నిజంగా మహిళా సభ్యులపై దాడి జరిగితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై కూడా కేసులు పెడతామని చెప్పారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానిస్తే సహించబోమన్నారు. ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆ వ్యాఖ్యలపట్ల వారికి కనీస పశ్చాత్తాపమే లేదన్నారు. స్పీకర్ పదవిని అవమానించడం అంటే రాజ్యాంగ వ్యవస్థనే అవమానించడమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు మాకు కూడా సోదరీమణులే.. వారిపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించమని చెప్పారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కాకినాడ వైసీపీలో ప్రకంపనలు..
# పార్టీని వీడిన కీలక సీనియర్ నేత నెక్కంటి సాయి ప్రసాద్

**-పార్టీకి రాజీనామా చేసిన వైసీపీ జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెక్కంటి సాయి ప్రసాద్**

**-ఆయన బాటలో సిద్ధమవుతున్న పలువురు కౌన్సిలర్లు**

**-రాజీనామా చేసిన నేతలు జనసేనలో చేరవచ్చని ఊహాగానాలు**

**కాకినాడ, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి (వైసీపీ) వరుస ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. తాజాగా కాకినాడ జిల్లాలో పార్టీకి మరో గట్టి షాక్ తగిలింది. సీనియర్ నాయకుడు, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెక్కంటి సాయి ప్రసాద్ వైసీపీకి రాజీనామా చేశారు.



పెద్దాపురం మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన సాయి ప్రసాద్, తన రాజీనామా లేఖను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి పంపించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీని వీడుతున్నట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి కారణంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**సాయి ప్రసాద్ బాటలోనే మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు**

సాయి ప్రసాద్ బాటలోనే జిల్లాలోని పలు పట్టణాలకు చెందిన మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు కూడా పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వారంతా త్వరలోనే పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరవచ్చని ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ వరుస రాజీనామాలు జిల్లా వైసీపీ శ్రేణుల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# తిరుమలలో ప్రారంభానికి
# సిద్ధమైన వరల్డ్ క్లాస్ ఎస్వీ మ్యూజియం

**-సీఎం చేతుల మీదుగా ఎస్వీ మ్యూజియం ప్రారంభానికి టీటీడీ ఏర్పాట్లు ముమ్మరం**

**-పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు టీటీడీ ఆదేశాలు**

**-మ్యూజియం పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి**

**-బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మెరుగైన మొబైల్ సిగ్నల్ వ్యవస్థపై సమీక్ష**

**-గరుడసేవ నాడు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**

**-ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు**



**తిరుమల, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** తిరుమలలో భక్తులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ మ్యూజియాన్ని ప్రారంభించేందుకు టీటీడీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఈ మ్యూజియం పనులను టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యూజియం లోని అన్ని విభాగాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. మ్యూజియం నిర్వహణకు సంబంధించి టీసీఎస్ బృందానికి కూడా అవసరమైన సూచనలు అందించాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకయ్య చౌదరి దిశానిర్దేశం చేశారు.

**సిగ్నల్ వ్యవస్థపై టీటీడీ ప్రత్యేక దృష్టి**

తిరుమల బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లతో పాటు.. సిగ్నల్ వ్యవస్థపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై కూడా అదనపు ఈవో సమీక్షించారు. ముఖ్యంగా తిరుమల, ఘాట్ రోడ్లు, కాలిబాట మార్గాల్లో మొబైల్ నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేకించి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే గరుడసేవ రోజున మొబైల్ సిగ్నల్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి సమీక్ష**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సెల్ టవర్ల పనితీరును సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి సమీక్షించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచి, ఎలాంటి అంతరాయం లేకుండా కమ్యూనికేషన్ సేవలు అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల నాటికి తిరుమల, తిరుపతి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుండగా, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది

# తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌పై చంద్రబాబు ప్రశంసలు..

**-వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కు అభినందన**

**-విద్యుత్ స్వయం సమృద్ధి దిశగా టీడీపీ కేంద్ర కార్యాలయం**

**-సోలార్ ప్యానళ్ల ద్వారా 800 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి**

**-క్యాంపస్‌లోనే ఒక మెగావాట్ ఉత్పత్తికి అవకాశం ఉందని వెల్లడి**

**-పర్యావరణ హితమైన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సంతృప్తి**




**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం విద్యుత్ విషయంలో పూర్తి స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. పార్టీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, పార్టీ కార్యాలయంలో చేపట్టిన పర్యావరణ హితమైన ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం ఆదర్శప్రాయంగా ఉందని, ఇక్కడి వాతావరణం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.

**సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశాం...**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “టీడీపీ కార్యాలయానికి అవసరమైన కరెంటును మనమే ఉత్పత్తి చేసుకునేందుకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశాం. మనకు 1000 కిలోవాట్ల విద్యుత్ అవసరం ఉండగా, ఇప్పటికే 800 కిలోవాట్లు ఇక్కడే ఉత్పత్తి అవుతోంది. భవిష్యత్తులో ఈ క్యాంపస్‌లోనే ఒక మెగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం ఉంది” అని వివరించారు. కేవలం విద్యుత్‌కే పరిమితం కాకుండా, భూగర్భ జలాలను సమర్థవంతంగా కూడా వినియోగించుకోవాలని, ఆహార వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారు చేసి ప్రాంగణంలోని చెట్లకు వినియోగించాలని సూచించారు.

**సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు...**

పార్టీ కేంద్ర కార్యాలయం, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు, “ఇలాంటి వాతావరణం అంటే అందరికీ ఇష్టమే. ఈ సందర్భంగా మన వర్కింగ్ ప్రెసిడెంట్‌ను (నారా లోకేశ్‌ను) అభినందిస్తున్నాను” అని అన్నారు. ప్రస్తుతం పార్టీలో మంచి వాతావరణంలో శిక్షణా తరగతులు జరుగుతున్నాయని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

## పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పరిశీలించిన పరిగి ఎంఈవో ఎం. అంజయ్య





**జర్నలిస్ట్ డైరీ పరిగి, సెప్టెంబర్ 8:** పరిగి మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిపాలనా పనితీరును మండల విద్యాశాఖాధికారి ఎం. అంజయ్య మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం 9 గంటలకు లక్నాపూర్ ప్రాథమిక పాఠశాలకు చేరుకున్న ఆయన, ప్రార్థనా సమావేశం (అసెంబ్లీ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, వారి క్రమశిక్షణ, అసెంబ్లీ నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి, చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను స్వయంగా, విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ (FLN) కార్యక్రమం, విద్యార్థుల అభ్యసన ప్రగతి రికార్డులు, చదువులో వెనుకబడిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక బోధన, తీరుపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే ఎఫ్ఆర్ఎస్, హాజరు నమోదు, పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, వాటిని నిరంతరం అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి నాణ్యత, వంటగది పరిశుభ్రత, మెనూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత గోవిందపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈవో, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూనే, చదవడం-రాయడం సామర్థ్యాలను మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎం. అంజయ్య మాట్లాడుతూ... “ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని మెరుగుపరచడమే విద్యాశాఖ ప్రథమ లక్ష్యం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి తగిన రీతిలో ప్రత్యేక బోధన అందించాలి. ప్రతి చిన్నారి తమ తరగతికి తగిన అభ్యసన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలి” అని స్పష్టం చేశారు...

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు ని బర్తరఫ్ చేయాలి

**- హనుమంతు ముదిరాజ్**



**జర్నలిస్ట్ డైరీ వికారాబాద్, సెప్టెంబర్ 08:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు, ఇందుకు ప్రోత్సహించిన వారిని వెంటనే పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి, మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన తర్వాత విచక్షణ మరిచి అహంకారపూరితంగా ప్రవర్తిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై స్థాయి మరిచి దూషణలకు దిగడం హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాల వల్లే ప్రజలు బీఆర్ఎస్‌ను గద్దె దించారని, అధికారం పోయాక మళ్లీ ఏదో విధంగా అధికారంలోకి రావడానికి ఇలాంటి దిగజారుడు చేష్టలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి తీరు కొనసాగితే భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగవడం ఖాయమని హెచ్చరించారు. గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్న నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## శాసనసభ స్పీకర్ కు తాతా మధు క్షమాపణ చెప్పాలి
## అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల ధర్నా




**జర్నలిస్ట్ డైరీ పరిగి, సెప్టెంబర్ 08:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ పరిగి పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. అత్యున్నత రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న నాయకుడిని, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, ఆయనపై అనర్హత వేటు వేయాలని పట్టుబట్టారు. ఈ నిరసనలో పరిగి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్ లను అందజేసిన గాంధీ.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 08 (జర్నలిస్ట్ డైరీ) :** కూకట్పల్లి మండలం పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని రామ్ నరేష్ నగర్ కాలనీ కి చెందిన గజ్జ హేమ నరేందర్ రెడ్డి కు కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన రూ.1,00,116/- ఒక లక్ష నూట పదహారు రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపేణా అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని ్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని , గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారు అని కొనియాడారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా ,మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినది అని ,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్ల లో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, శ్రీధర్ రెడ్డి, యాసిన్, దేవేందర్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు

# ఖబడ్దార్ వీర్లపల్లి శంకర్!

**-కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం**
**-తెలంగాణ జాతిపిత కేసీఆర్‌ను అవమానిస్తే సహించేది లేదు**
**-షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
**-షాద్‌నగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆందోళన**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 08 (జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక రాష్ట్రం కోసం కోట్లాది తెలంగాణ ప్రజలను ఏకం చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ షాద్‌నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను అవమానించేలా మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయాలంటే విధానాలు, పాలనపై చేయాలని, వ్యక్తిగతంగా దిగజారి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్ చేసిన కృషిని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదని అన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు. కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి హుందాగా వ్యవహరించాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారు

**-మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికం**
**-మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి**
**-వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 08 (జర్నలిస్ట్ డైరీ) :** మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసే అధికారం ఎవరిచ్చారుని మాజీ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకురాలు ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద మహిళ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పై దాడి అప్రజాస్వామికమన్నారు.రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలకు రక్షణ లేనప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రజల అవస్థలు పడుతున్నారని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి, ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో 'చోరీ'లకు పాల్పడుతున్న 13 మంది ముద్దాయిలు అరెస్ట్




**-రూ 22 లక్షల 70 వేల విలువైన సొత్తును స్వాధీనం**
**-పోలీసులను అభినందించిన మార్కాపురం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**

**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** జిల్లా లోని సియస్.పురం, పామూరు, కనిగిరి, కొనకనమిట్ల మండలాల్లోని దేవాలయాల్లో ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడిన 13 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు.ఈ మేరకు
1.ఇండ్ల విష్ణువర్ధన్ (28), రావిగుంటపల్లి గ్రామం, పామూరు మండలం, మార్కాపురం జిల్లా (ఏ-1),
2.తమ్మిశెట్టి రమణయ్య(50), సి.ఎస్.పురం గ్రామం(ఏ-2),
3.మల్లాల చెంచు సుబ్బారావు, (39) ఏలూరుపాడు గ్రామం, గుడ్లూరు మండలం, ప్రకాశం జిల్లా. (ఏ-3),4.సోమరాజుపల్లి ఉమామహేశ్వరరావు(41), పొదిలి పట్టణం, మార్కాపురం జిల్లా(ఏ-44),(సస్పెక్ట్ నంబర్ - 50 - పొదిలి పోలీస్ స్టేషన్), 5.కొమ్మ అలియాస్ కొమ్మి కాటంరాజు (33), వంగపాడు గ్రామం, కనిగిరి మండలం, మార్కాపురం జిల్లా. (ఏ-5),6.బత్తుల శ్రీను(50), సి.ఎస్.పురం, మార్కాపురం జిల్లా. (ఏ-6),7.పిన్ని రాజీవ్(22) పల్లెపాలెం, కొత్తపట్నం,ప్రకాశం జిల్లా (ఏ-7),8.కమ్మ సూర్యతేజ (43), తూర్పు కమ్మపాలెం, ఎన్.టి.ఆర్. విగ్రహం దగ్గర, ఒంగోలు,ప్రకాశం జిల్లా(ఏ-8),
9.మోకా ఆంజనేయులు(42), వినోదరాయునిపాలెం గ్రామం, ఎన్.జి.పాడు మండలం, ప్రకాశం జిల్లా(ఏ-9), 10.దేరంగుల వెంకట రమణ (50),అద్దంకి పట్టణం, ప్రకాశం జిల్లా (ఏ-10),
11.బండారు తిరుపతయ్య,(45) వడ్డేపాలెం, సి.ఎస్.పురం గ్రామం, మార్కాపురం జిల్లా. (ఏ-11),12.దూదేకుల నాగూర్ షరీఫ్ (41) గిద్దలూరు, మార్కాపురం జిల్లా(ఏ-12),
13.చందలూరి బాల గురవయ్య (42), భావాపురం గ్రామం, కొమరోలు మండలం, మార్కాపురం జిల్లా(ఏ-13) అను ముద్దాయిలను మంగళవారం జిల్లా లోని పామూరు మండలం, రావిగుంటపల్లి గ్రామ



శివారులో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు
వీరిపై సిఎస్పురం, కనిగిరి, కొనకనమిట్ల, పామూరు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

**దొంగిలించబడిన సొత్తు వివరాలు...**

1) సి. ఎస్.పురం శివాలయంలో సుమారు 12 లక్షల విలువ గల రెండు పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాలు మరియు ఒక ఇత్తడి అయ్యప్ప విగ్రహం.
2) కనిగిరి మండలం చీరలదిన్నె గ్రామంలో గల కాశీ విశ్వేశ్వర స్వామి గుడిలో సుమారు 10,00,000/- రూపాయల విలువ గల 4.5 కేజీల వెండి కవచము మరియు వెండి నాగాభరణము. 3) కొనకనమిట్ల మండలం గొట్లగట్టు రామాలయంలో 25,000/- రూపాయల విలువగల సుమారు 25 కేజీల ఇత్తడి హనుమంత వాహనము. 4) పామూరు మండలం వర్గం పల్లి గ్రామంలో పోలేరమ్మ తల్లి దేవాలయంలో సుమారు 50 వేల రూపాయల విలువ గల ఇత్తడి కిరీటము మరియు రెండు చేతుల కవచములు కలిపి మొత్తం విలువ సుమారు 22,75,000/- రూపాయలు ఉంటుందని ఎస్పీ చోరీ సొత్తు వివరాలు తెలిపారు.

**పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు...**

1) సి.ఎస్.పురం శివాలయంలో సుమారు 12 లక్షల విలువ గల రెండు పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాలు మరియు ఒక ఇత్తడి అయ్యప్ప విగ్రహం.
2) కనిగిరి మండలం చీరలదిన్నె గ్రామంలో గల కాశీ విశ్వేశ్వర స్వామి గుడిలో సుమారు 10,00,000/- రూపాయల విలువ గల 4.5 కేజీల వెండి ఆవరణములు కరిగించి పాత పోసిన నాలుగు వెండి గిన్నెలు.
3) కొనకనమిట్ల మండలం గొట్లగట్టు రామాలయంలో దొంగలించిన25 కేజీల ఇత్తడి హనుమంత వాహనము అమ్మగా వచ్చిన 20,000/- నగదు. 4) పామూరు మండలం వగ్గం పల్లి గ్రామంలో పోలేరమ్మ తల్లి దేవాలయంలో సుమారు 50 వేల రూపాయల విలువ గల ఇత్తడి కిరీటము మరియు రెండు చేతుల కవచములను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు 22,70,000/- రూపాయలుగా చెప్పారు.వీటితో పాటు ఎర్టిగా కారు -1, తుఫాన్ కారు-1, మోటార్ సైకిళ్లు-2 స్వాధీనం చేసుకున్నారు

**కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే...**

పట్టుబడిన ముద్దాయిలలో బేల్దారు పనులతో పాటు, మరికొందరు స్లాబ్ మిల్లర్ పనులు చేస్తూ ఉంటారు. ఆయా పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లే క్రమంలో ఒకరికొకరు పరిచయం ఏర్పడింది. వీరిలో విష్ణువర్ధన్ ఒక ప్రైవేట్ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, అతనికి సుబ్బారావు తోడుగా ఉండేవాడు. వీరిలో పాత నేరస్థుడైన సోమేపల్లి ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి ఒక దేవాలయంలో పూజారిగా పనిచేస్తూ, దేవాలయాల్లో చోరీలకు పాల్పడి సులభంగా డబ్బు సంపాదించవచ్చనే సలహాలు ఇచ్చేవాడు. కొమరోలు మండలానికి చెందిన బాల గురవయ్య చోరీ చేసిన సొత్తును స్వీకరించే తీసుకునే వ్యక్తిగా ఉండేవాడు. ఈ విధంగా దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడటం మొదలుపెట్టారు. ఈ క్రమంలో పలు దేవాలయాలను ముందుగా గుర్తించి, అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ, దొంగతనాలకు పాల్పడ్డారు.

**ఇటీవల కాలంలో...**

మార్కాపురం జిల్లా పరిధిలోని సి.ఎస్.పురం, పామూరు, కనిగిరి, కొనకనమిట్ల మండలాల్లోని పలు దేవాలయాలలో వరుసగా జరిగిన దొంగతనాలను దృష్టిలో ఉంచుకుని, మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఈ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ నిరంతర పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు కనిగిరి డీఎస్పీ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో పామూరు సీఐ డి. వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు.శ్రీనివాసరావు, సి.ఎస్.పురం, వెలిగండ్ల, పామూరు, కొనకనమిట్ల, పిసీ పల్లి పోలీస్ స్టేషన్ల ఎస్ఐ లు వెంకటేశ్వర రెడ్డి, కోటేశ్వరరావు, అనూక్, శ్రీకాంత్, నరసింహారావు వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, కేసులను వివిధ కోణాల్లో దర్యాప్తు చేయడంతో పాటు, సాంకేతిక ఆధారాలను సేకరించి, ఆయా గ్రామాల్లో ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వారి ద్వారా అందిన విశ్వసనీయ సమాచారాన్ని విశ్లేషిస్తూ ముందుకు సాగాయి. ఈ క్రమంలో మంగళవారం (08.09.2026) పామూరు మండలం రావిగుంటపల్లి గ్రామ శివారులో పై దొంగతనాలకు పాల్పడిన 13 మంది నిందితులను అరెస్టు చేశారు.

**రూ.22.70 లక్షల విలువైనచోరీ సొత్తు రికవరీ..**

అరెస్టు చేసిన వారి వద్ద నుండి సుమారు రూ.22.70 లక్షల విలువైన పంచలోహ విగ్రహాలు, ఇత్తడి విగ్రహాలు, ఇత్తడి తొడుగులు మరియు వెండి దిమ్మలు, నగదు.20,000/-లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, నేరాలకు ఉపయోగించిన ఒక తుఫాన్ వాహనం, ఒక ఎర్టిగా కారు మరియు రెండు మోటార్ సైకిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి**

దేవాలయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. కెమెరాలకు సంబంధించిన డివిఆర్ లను ఎత్తైన, భద్రమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అలాగే, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని తరచూ పరిశీలిస్తూ, వాటి రికార్డింగ్ డేటా కొన్ని రోజులపాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద ఘటనలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

**అధికారులను అభినందించిన ఎస్పీ**

దేవాలయాలలో జరుగుతున్న ఈ వరుస దొంగతనాల దర్యాప్తును ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణలో కేసులు ఛేదించడంలో కృషి చేసిన కనిగిరి డిఎస్పి పి.శ్రీధర్ బాబు, పామూరు సిఐ డి.వినోద్ కుమార్, కనిగిరి సీఐ యు శ్రీనివాసరావు, ఎస్సైలను, వారి సిబ్బంది, సిసిఎస్ మరియు ఐటీ కోర్ సిబ్బందిని మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అభినందించారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

**-దుర్గం మల్లికార్జున గౌడ్ మున్సిపల్ కౌన్సిలర్ వికారాబాద్**
**-స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను**
**-రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే**
**-తాతా మధుపై చర్యలు తీసుకోవాలి.. వెంటనే సస్పెండ్ చేయాలి**

స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు.. రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉంది.



ఒక అట్టడుగు వర్గాల బిడ్డ, దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రాకుండా ఉంటారు. కానీ ఆయన పార్టీకి చెందిన నాయకులు మాత్రం బయటకు వచ్చి డ్రామాలు చేస్తున్నారు.
స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. ఆయనను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను.
తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలి. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడినా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. శాసనసభ, స్పీకర్ పదవి పట్ల కనీస గౌరవం లేని విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలి.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# వైసీపీకి రాజీనామా చేసిన
# బొత్స మేనల్లుడు చిన్న శ్రీను

-జగన్‌కు రాజీనామా లేఖ

-విజయనగరం వైసీపీలో కీలక పరిణామం


-విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి నుంచి వైదొలగిన చిన్న శ్రీను

-వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా

-అధినేత జగన్‌కు లేఖ పంపిన మజ్జి శ్రీనివాసరావు

-ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బ




(మజ్జి శ్రీనివాసరావు) 9/9/26

కాపీ టు:
శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి గారు,
YSRCP STATE Co ordinator
శ్రీ కురసాల కన్నబాబు గారు,
YSRCP ఉత్తరాంధ్ర జిల్లా కోఆర్డినేటర్.

**విజయనగరం, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వైసీపీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పార్టీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

**అన్ని పదవుల నుండి వైదొలగుతున్నట్లు స్పష్టం**

మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**కీలక నేత బొత్స మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టం**

బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# భూముల రీ-సర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలి

**-ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి**





**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** భూముల రీ-సర్వే ప్రక్రియను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ఒంగోలు డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సదస్సులో ఆమె పాల్గొని పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వీఆర్వో, ఆర్.ఐ, మండల సర్వేయర్, తహసిల్దార్లు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రస్తుతం ఆరో విడత రీసర్వే సాగుతున్నందున మండలాల వారీగా పురోగతిని ఆమె సమీక్షించారు. నిర్దిష్ట గడువు లోపు రీసర్వే పూర్తి చేయటంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ దిశగా పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు చెప్పారు. పొరపాటున తమ భూములు 22(ఏ) జాబితాలో నమోదయ్యాయని ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకొని, వారి భూములకు క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. మ్యుటేషన్లు కూడా సకాలంలో అయ్యేలా చూడాలన్నారు. వివరాలన్నీ సక్రమంగా ఉన్న భూములకు సంబంధించిన పాస్ పుస్తకాల ప్రింటింగు, పంపిణీ పెంచాలన్నారు. ' సర్ ' కార్యక్రమంలో పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పి.వెంకటరమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, తహసీల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# ఈ నెల 12 న జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకునేలా పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి



**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** సెప్టెంబర్ 12 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మార్కాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ మరియు సెకండ్ క్లాస్ మేజిస్టేట్ డి.శాంత కుమారి తరఫున మార్కాపురం కోర్టుల పరిధిలోని ఆరు మండలాల కోర్టు కానిస్టేబుల్స్ తో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సమావేశమునకు ముఖ్య అధ్యక్షులు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి యం. బాలాజీ మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకునేలా పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టవలసినదిగా తెలియజేశారు.ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు కక్షలు వీడి సామరస్య పూర్వకముగా తమ కేసులను రాజీ చేసుకుని, పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పవలసిన ఆవశ్యకతను గురించి తెలియజేశారు.హెల్మెట్లు తప్పనిసరిగా వాడవలసినదిగా ద్విచక్ర వాహన దారులకు అవగాహన కల్పించవలసినదిగా తెలియజేశారు.ఇరు పార్టీలు పరస్పరం ఒకరి మీద మరొకరు ఆవేశంలో పెట్టుకున్న కేసులను రాజీ చేయడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు .ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేయడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని కావున, కక్షిదారులు ఈ అవకాశమును వినియోగించుకుని తమ తమ కేసులను రాజీ చేసుకోవలసినదిగా ఆయన తెలియజేశారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భరణం కేసులు, బ్యాంకుల ప్రీ లిటిగేషన్ కేసులు మరియు బిఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం. త్రిపురాంతకం, వై.పాలెం సర్కిల్ కోర్టు కానిస్టేబుల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొత్తూరులో రూ.1.42 కోట్ల
# విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం

-ఒకరి అరెస్ట్.. 11.319 కిలోల హాష్ ఆయిల్, సెల్‌ఫోన్ స్వాధీనం

-కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జునరెడ్డి వెల్లడి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 08 (జర్నలిస్ట్ డైరీ) :** కొత్తూర్ పోలీసులు, ప్రత్యేక ఆపరేషన్ బృందం (ఎస్ఓటీ), షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా హాష్ ఆయిల్‌ను తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.42 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్ముల్‌నర్వలోని పి అండ్ జీ కంపెనీ రోడ్డు దాటి వెళ్లిన అనంతరం అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని హెచ్. ధృవ్ అలియాస్ ధృవ్ జోషి (30)గా గుర్తించారు. అతను మెద్చల్--మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌కు చెందినవాడని, ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఉన్న కళాశాల బ్యాగ్‌ను తనిఖీ చేయగా 11 ప్యాకెట్లలో హాష్ ఆయిల్ లభించింది. ముదురు గోధుమ రంగులో చిక్కటి ద్రవ రూపంలో ఉన్న ఈ పదార్థానికి గంజాయి నుంచి తయారైన హాష్ ఆయిల్‌కు ఉండే ప్రత్యేకమైన ఘాటైన వాసన ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో నిందితుడు ఈ హాష్ ఆయిల్‌ను ఒడిశా రాష్ట్రానికి చెందిన రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకుని, కొత్తూర్ పరిధిలో అవసరమైన వారికి విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ రవాణా ద్వారా ఆర్థిక లాభం పొందేందుకు కమిషన్ లేదా వాటా ప్రాతిపదికన పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 11 ప్యాకెట్లలో ఉన్న మొత్తం 11.319 కిలోల హాష్ ఆయిల్‌తో పాటు ట్విలైట్ పర్పుల్ రంగులోని రియల్‌మీ 12ఎక్స్ 5జీ స్మార్ట్‌ఫోన్ ఉంది. ఈ అరెస్ట్, స్వాధీనం చర్యలు షాద్‌నగర్ జోన్ డీసీపీ సి. శిరీష, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, కొత్తూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

# వెలుగొండ ప్రాజెక్టు "వెలుగుల జలధారా" పాట సీడి ఆవిష్కరణ




**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వెలుగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను, మార్కాపురం ప్రాంత ప్రజల ఆశలను, రైతుల భవిష్యత్ ను, ఈ ప్రాంత అభివృద్ధి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మార్కాపురం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని డోలా శ్యామలా దేవి రచించిన "వెలుగొండ జలధారా -- వెలుగుల జలధారా" పాటకు సంబందించిన సీడీ ని మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆవిష్కరించారు.ప్రాజెక్టు ద్వారా వచ్చే జలాలు ఈ ప్రాంతానికి కేవలం సాగునీటిని మాత్రమే కాకుండా రైతులకు భరోసా, ప్రజలకు ఆశ, మార్కాపురం ప్రాంతానికి అభివృద్ధి, భవిష్యత్ తరాలకు సుసంపన్నమైన జీవనాన్ని అందించే వెలుగుల జలధారగా మారాలని ఆకాంక్షిస్తూ ఈ పాటను రూపొందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామలాదేవి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు బ్రోచర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్





**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** మార్కాపురం పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 11,12,13 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌కు పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత, సమష్టి భావనను పెంపొందిస్తాయని తెలిపారు.రాష్ట్ర స్థాయి పోటీలను మార్కాపురంలో నిర్వహించడం స్థానికంగా క్రీడా వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ముఖ్యంగా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. క్రీడాకారులకు వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధితులకు సూచించారు..పోటీలు ప్రశాంత వాతావరణంలో, క్రీడా నియమ నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీలు తదితరులు పాల్గొన్నారు.

# బారిష్టర్ డా.మరియం కామిల్‌కు ఘన సన్మానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 08 జర్నలిస్ట్ డైరీ :** లండన్ కోర్టులో మీడియా చట్టానికి సంబంధించిన కేసుల్లో బారిష్టర్‌గా పనిచేస్తున్న డా.మరియం కామిల్‌ను తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్, నల్సార్ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫె11సర్ వి.బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నిరుపేదలకు చట్టాలపై అవగాహన కల్పించి, మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బీసీఎల్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన డాక్టర్ కామిల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి జ్యుడిషియల్ అసిస్టెంట్‌గా సేవలందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డా.అక్తర్ అలీ, ప్రొ.ధరం పాల్, న్యాయవాదులు డా.యాసర్, వశీయుద్దీన్, డా.సాజిద్ అలీ ఖాన్, కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్ పాల్గొన్నారు. విద్యార్థులు డా.కామిల్‌తో లండన్ న్యాయ వ్యవస్థపై ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.

# కీర్తిరెడ్డి "ఆత్మీయ" పరామర్శ



**హైదరాబాద్ సెప్టెంబర్ 08 జర్నలిస్ట్ డైరీ :**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రౌడీ రాజకీయాలకు తెరలేపింది
ప్రత్యర్థి పార్టీ నేతల ఇళ్లపై భౌతిక దాడులు దుర్మార్గం
ఇలాంటి దాడులకు మూల్యం చెల్లించక తప్పదు
– బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కీర్తిరెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రౌడీ రాజకీయాలకు తెరలేపిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కీర్తిరెడ్డి ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని ఆమె మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి గారి మాతృమూర్తి నాగం శ్రీదేవి గారిని కీర్తిరెడ్డి ఆత్మీయంగా పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షిత్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఇటీవల నల్గొండలో నాగం వర్షిత్ రెడ్డి గారి ఇంటిపై కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తులు చేసిన దాడిలో నాగం శ్రీదేవి తీవ్ర అస్వస్థతకు గురయ్యారని కీర్తిరెడ్డి తెలిపారు. ఆస్పత్రి నుంచి నిన్న డిశ్చార్జ్ అయిన శ్రీదేవి ప్రస్తుతం ఇంట్లో కోలుకుంటున్నారని పేర్కొన్నారు.

మూల్యం చెల్లించక తప్పదు ప్రత్యర్థి పార్టీ నాయకుల ఇళ్లపై దాడులు చేయడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కీర్తిరెడ్డి మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇలాంటి దాడులకు పాల్పడుతున్న వారు భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.నాగం శ్రీదేవి గారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కీర్తిరెడ్డి ఆకాంక్షించారు.

# గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి

**-ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి**
**-మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం!**
**-గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా**
**-500 వాట్లకు రూ.1,000/-లు -1,000 వాట్లకు రూ.2,250/-లు తాత్కాలిక విద్యుత్ రుసుముగా నిర్ణయం**




**విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు.ఈ సందర్భంగా భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు. మండపాల్లో విద్యుత్ అలంకరణలు, తాత్కాలిక విద్యుత్ వినియోగం విషయంలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు చేయాలని సీఎండీ సూచించారు. మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లు మాత్రమే వినియోగించాలని తెలిపారు.

**మండపాలకు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దు**

మండపాలకు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని స్పష్టం చేశారు. విద్యుత్ వైరింగ్, ఇతర పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని సూచించారు. అధిక లోడ్ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లారెడ్డి సూచించారు. తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని కోరారు.మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసే సమయంలో భక్తులు, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. అత్యవసర వాహనాలు, సేవలకు ఆటంకం కలగకుండా మండపాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందిస్తాం**

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు.ఈ మేరకు
500 వాట్లకు రూ.1,000/-
1,000 వాట్లకు రూ.2,250/-లు
చొప్పున తాత్కాలిక విద్యుత్ సరఫరా రుసుము ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు తెలిపారు.గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాలు, ఏపీసిపిడిసిఎల్ వెబ్‌సైట్ (ఏపీసిపిడిసిఎల్.ఇన్) మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సీఎండీ తెలిపారు.

**మండపాలకు చట్ట విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగించరాదు**

మండపాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టవిరుద్ధంగా విద్యుత్‌ను వినియోగించరాదని సీఎండీ హెచ్చరించారు. అనధికారిక కనెక్షన్లు తీసుకోవడం లేదా అక్రమంగా విద్యుత్ వినియోగించడం గుర్తిస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పాటు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆకాంక్షించారు.

# గ్రామ స్థాయిలో సైతం శక్తి టీమ్ సేవలు అందించాలి

**-ప్రతి ఒక్కరి మొబైల్‌లో 'శక్తి యాప్' డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలి**
**-శక్తి టీమ్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన బాపట్ల సీసీఎస్ డీఎస్పీ**




**బాపట్ల జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలోని శక్తి బృందాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళలు, చిన్నారులు, గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు శక్తి బృందాల ద్వారా అందించాల్సిన సేవల గురించి తెలిపారు..ఈ సందర్భంగా డీఎస్పీ పి.జగదీష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలోని విధులు నిర్వహిస్తున్న 4 శక్తి బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారు నిర్వహించవలసిన విధుల గురించి దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఈ నాలుగు బృందాల విధులను మహిళ పిఎస్ ఇన్స్పెక్టర్ ఎస్ సుబ్బారావు ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ ఉంటారన్నారు. ఒక్కొక్క బృందానికి ఎస్ఐ స్థాయి అధికారులు ఇన్చార్జిగా నియమించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు శక్తి బృందాల సేవలు పట్టణ ప్రాంతాలకే పరిమితమయ్యాయని, ఇకపై వీరి సేవలను గ్రామీణ స్థాయికి కూడా విస్తరించి, పోలీస్ శాఖ అందిస్తున్న సేవలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించామన్నారు.

**'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' గురించి వివరించాలి**

పాఠశాల విద్యార్థులకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' గురించి వివరించాలని, కళాశాలలకు వెళ్ళే ప్రతి విద్యార్థిని మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని తెలిపామన్నారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఎవరైనా రోడ్డు ప్రమాదానికి గురైనా, లేదా ఆపదలో ఉండి సహాయం కోరినా వెంటనే మానవతా దృక్పథంతో స్పందించి సేవలు అందించాలని, తద్వారా పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని ఆదేశించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరిగా ఉండే మహిళలకు శక్తి యాప్ గురించి వివరించాలని, అలాగే గ్రామీణ వృద్ధులకు సైబర్ నేరాలు, హెల్మెట్ ధారణ ఆవశ్యకత మరియు జిల్లా పోలీస్ యంత్రాంగం అందిస్తున్న సేవలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశామన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సుబ్బారావు, ఎస్ఐ చెన్నకేశవులు, ఉమెన్ ఎస్ఐ చంద్రావతి శక్తి టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధ ఎస్టీ మహిళపై సీఐ దురుసు ప్రవర్తన..ఏపీ ఎస్టీ కమిషన్ సీరియస్!

**-ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్..**
**-జిల్లా ఎస్పీ సైతం సమగ్ర విచారణకు ఆదేశం**
**-విచారణ నివేదిక అనంతరం శాఖాపరమైన చర్యలు**
**-బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్**

**చీరాల,(బాపట్ల జిల్లా),ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** బాపట్ల జిల్లా చీరాల పట్టణం లోని ఆదినారాయణపురంలో కార్డెన్ సెర్చ్ సందర్భంగా వృద్ధ ఎస్టీ మహిళ పట్ల చీరాల రెండో పట్టణ సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుపై వివాదం తీవ్ర రూపం దాల్చింది. సీఐ దురుసుగా వ్యవహరించిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ వ్యవహారం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సుమోటోగా స్వీకరించడం చర్చనీయాంశంగా మారింది.

**సీఐ ప్రవర్తనపై జిల్లా ఎస్పీ విచారణకు ఆదేశం**


జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల ఎస్‌డీపీవో ఎం.డి. మొయిన్ ఘటనపై విచారణ చేపట్టనున్నారు. విచారణలో వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించనున్నారు. విచారణ నివేదిక అందిన అనంతరం తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.


**కార్డెన్ సెర్చ్‌లో అసలేం జరిగింది?**

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెప్టెంబర్ 6న జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదినారాయణపురంలో నాటుసారా తయారీ, గంజాయి విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పేరం విజయ్, కార్తీక్‌లపై క్రిమినల్ కేసులు, నాటుసారా విక్రయ కేసులు, పోక్సో కేసులు ఉన్న నేపథ్యంలో వారి ఇళ్లు, పరిసరాలను తనిఖీ చేసేందుకు సీఐ శశికుమార్ సిబ్బందితో వెళ్లినట్లు పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధ మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వడానికి నిరాకరించి, తనిఖీలకు సహకరించలేదని, దీంతో సీఐ దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం అందిందని ఎస్పీ కార్యాలయం పేర్కొంది.

**వైరల్ వీడియోపై ఏపీ "ఎస్టీ" "కమిషన్" సీరియస్**


ఇదే ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించింది. వృద్ధ ఎరుకుల (ఎస్టీ) మహిళ పట్ల చీరాల రెండో పట్టణ సీఐ అనుచితంగా ప్రవర్తించి, అభ్యంతరకరమైన భాష ఉపయోగించారన్న ఆరోపణలపై వాస్తవ నివేదిక సమర్పించాలని బాపట్ల జిల్లా ఎస్పీని కమిషన్ లేఖ ద్వారా కోరింది.






**పోలీసుల తీరుపై గత ఆరోపణలపైనా కమిషన్ దృష్టి**

చీరాల పోలీస్ డివిజన్‌లో కొంతమంది పోలీసు అధికారులు ప్రజలు, కార్యకర్తలు, జర్నలిస్టులతో సక్రమంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు కూడా కమిషన్ దృష్టికి వచ్చినట్లు లేఖలో పేర్కొన్నారు. అలాగే అక్రమ ఇసుక తవ్వకాలు, సహజ వనరుల దోపిడీని ప్రశ్నిస్తున్న వారిపై ఒత్తిళ్లు, బెదిరింపులు, క్రిమినల్ కేసులు పెడుతున్నారన్న ఆరోపణలు, అక్రమ ఇసుక రవాణాదారులతో కొంతమంది పోలీసు అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలను కూడా కమిషన్ ప్రస్తావించింది.



GOVERNMENT OF ANDHRA PRADESH
AP STATE COMMISSION FOR SCHEDULED TRIBES

From
Sri K. Rama Seshu,
Secretary,
AP ST Commission,
VIJAYAWADA.

To
The Superintendent of Police,
Bapatla District,
Bapatla.

Lr.No:3634/JA/Chairman-Sumoto/2026, Dt:07.09.2026

Sir,

Sub: AP State Commission for Scheduled Tribes – The Chairman, AP State ST Commission, Vijayawada - Complaint against the Sation House Officer, II Town Police Station, Chirala due to alleged misconduct towards an elderly ST Woman - Immediate take necessary action against the Police officer- Submit detailed report - Regarding.

Ref: Arising.

***

I invite your kind attention to the subject and reference cited above.

It is submitted that public dissatisfaction had been expressed regarding the functioning of the police administration in Chirala Police Division. It was alleged that certain police officials were not treating members of the public, activists and journalists properly. An incident involving an elderly woman belonging to the ST Erukula community was reported at Ramnagar during a cordon search on 06-09-2026, wherein the Chirala II Town CI was alleged to have behaved improperly and used offensive language towards her. A video of the incident was reportedly circulated on social media, causing concern among the public.

It is further alleged that persons questioning illegal sand mining and exploitation of natural resources were facing pressure, threats and criminal cases. There were also allegations of police officials being in connivance with persons involved in illegal sand transportation. Similar allegations regarding the conduct of police officials had reportedly been raised in the past. The report also raised concerns regarding the supervision of the Chirala DSP and the implementation of friendly policing. Therefore, it was suggested that the competent authorities verify the allegations, conduct an impartial inquiry and take appropriate action as per law.

In view of the seriousness of the allegations, the Chairman took suo motu cognizance of the matter and decided to call for a factual report from the concerned authorities regarding the alleged conduct of the police officials towards the elderly ST woman. The matter be examined based on the report, and appropriate action be taken as per law.

Yours faithfully
for Secretary
AP State ST Commission

Copy to. The Chairman Table.

ఏపీ ఎస్టీ కమీషన్ జారీ చేసిన లేఖ

**ఇక విచారణ నివేదికపైనే ఉత్కంఠ..?**

ఒకవైపు వృద్ధ ఎస్టీ మహిళ పట్ల సీఐ ప్రవర్తనపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ సుమోటోగా విచారణకు దిగడం.. మరోవైపు బాపట్ల జిల్లా ఎస్పీ స్వయంగా స్పందించి ఎస్‌డీపీవో స్థాయి అధికారితో సమగ్ర విచారణకు ఆదేశించడం పోలీసు శాఖలో ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణలో ఏం తేలనుంది? సీఐ శశికుమార్‌పై ఎలాంటి శాఖాపరమైన చర్యలు ఉండనున్నాయి? అన్నది ఇప్పుడు చీరాలలో ఆసక్తికరంగా మారింది.


# ఈఫిల్ టవర్‌కు హిందూ సాధువులు..

**మహిళా సిబ్బందిని తప్పించడం పట్ల ఆందోళన**



**పారిస్,జర్నలిస్ట్ డైరీ :**
గత వారం పారిస్‌లోని ఈఫిల్ టవర్ ను ఓ హిందూ సంస్థకు చెందిన సాధువులు విజిట్ చేశారు. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందిని విధుల నుంచి తప్పించారు. ఈ చర్యలను ఖండిస్తూ ఈఫిల్ టవర్‌లోని ఉద్యోగులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈఫిల్ టవర్‌ను మూసివేశారు. శనివారం జరిగిన ఘటన గురించి ఉద్యోగులు మీటింగ్ నిర్వహించారు. బోచసన్వాసి అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థాన్ (బీఏపీఎస్) సంస్థకు చెందిన సుమారు 100 మంది హిందూ సాధవులు ఈఫిల్ టవర్‌ను సందర్శించారు. ఆ సందర్శన సమయంలో మహిళా ఉద్యోగులను విధులకు దూరంగా ఉంచారు. హిందూ సాధువులకు మహిళలు కనబడాకుండా ఉండేందుకు ఆ నిర్ణయం తీసుకున్నారు.హిందూ సాధువుల బృందం వచ్చిన సమయంలో పురుషులను విధుల్లోకి తీసుకున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధి డయాన్ డావోని తెలిపారు. మహిళా సిబ్బందిని తప్పించిన అంశంపై మేనేజ్మెంట్‌తో చర్చలు జరిపారు. మళ్లీ ఇలా జరగకుడదని మేనేజ్మెంట్‌తో సిబ్బంది పేర్కొన్నది. ఆ ఘటన పట్ల సిబ్బందికి మేనేజ్మెంట్ క్షమాపణలు చెప్పింది. ఈఫిల్ టవర్ వద్ద జరిగిన ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్లు పారిస్ మేయర్ ఎమ్మాన్యువల్ గ్రెగరి తెలిపారు. ఉద్యోగుల ఆగ్రహాన్ని అర్థం చేసుకున్నామని, వారి మనస్తాపం వాస్తవమైందే అని గ్రెగరి అన్నారు. ఈ ఘటనకు చెందిన అన్ని అంశాలు తెలవాల్సిందే అని పేర్కొన్నారు. ఇటీవల పారిస్ శివారు ప్రాంతంలో ఓ హిందూ ఆలయాన్ని ఓపెన్ చేశారు. ఆ గుడి ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు హిందూ సంస్థకు చెందిన సాధువులు పారిస్‌కు చేరుకున్నారు. అయితే ఆ బృందం సంఖ్య భారీగా ఉన్న నేపథ్యంలో ఇతరులకు ఇబ్బంది కలిగించరాదన్న ఉద్దేశంతో ఈఫిల్ టవర్ వద్ద ఏర్పాట్లు చేశారు. ఆ బృందం రాక సమయంలో ఎవరికీ ఎటువంటి అడ్డు కలిగించలేదని ఈఫిల్ టవర్ మేనేజ్మెంట్ తన ప్రకటనలో తెలిపింది. అతిథులను ఆహ్వానించడం అంటే మన విలువల్ని పోగొట్టుకోవడం కాదు అని, ఫ్రాన్స్‌లో మహిళలు ప్రజాజీవితంలో సంపూర్ణంగా ఉంటారని, ఒకరి కోసం వాళ్లను అదృశ్యం కావాలని చెప్పరని నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ యేల్ బ్రాన్ పివెట్ తెలిపారు.

## ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్న పుతిన్, మోదీ



**న్యూఢిల్లీ ,జర్నలిస్ట్ డైరీ :**
ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. శుక్రవారం ఢిల్లీలో ద్వైపాక్షిక భేటీలో పాల్గొనున్నారు. వాణిజ్యం, ఆర్థిక సహకారంపై చర్చించనున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్‌కోవ్ తెలిపారు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు పుతిన్ ఇండియా వస్తున్నారు. సెప్టెంబర్ 12వ తేదీ నుంచి ఢిల్లీలో ఆ సదస్సు జరగనున్నది. ద్వైపాక్షిక సంబంధాలపై పుతిన్, మోదీ భేటీలో చర్చించనున్నట్లు దిమిత్రి తెలిపారు. బ్రిక్స్ సమ్మిట్‌ను హోస్ట్ చేస్తున్న ఇండియా దాంట్లో సక్సెస్ కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని దేశాల తమ కరెన్సీతో భారత్‌పై వత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఆర్థిక రంగం గురించి కూడా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. సుఖోయ్-57 ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాలు, అణ్వస్త్ర విద్యుత్తు కేంద్రాలు, అమెరికా ఆంక్షల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు.

## ఢిల్లీ మాజీ సీఎస్ రాకేశ్ మెహతా ఆత్మహత్య



**న్యూఢిల్లీ,జర్నలిస్ట్ డైరీ :**
ఢిల్లీ మాజీ ప్రధాన కార్యదర్శి రాకేశ్ మెహతా(74) నోయిడాలోని తన నివాసంలో సెప్టెంబర్ 6న ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన తన ఆరోగ్య, మానసిక సమస్యలను ప్రస్తావిస్తూ రాసిన ఒక నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. 1975 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి రాకేశ్ మెహతా.. మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ హయాంలో పనిచేశారు.

## అంగన్‌వాడీ పాఠశాలలు, వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనం, రేషన్ పంపిణీ పకడ్బందీగా అమలు చేయాలి

-ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి
-రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్న చైర్మన్









**మద్దిపూడి, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ పకడ్బందీగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. బుధవారం మద్దిపూడి మండలంలోని గార్లపేట ఎస్సీ కాలనీ, ఓసీ కాలనీ, వేమవరం, మద్దిపూడి ఎస్సీ కాలనీలలోని అంగన్‌వాడీ కేంద్రాలను, గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, చౌక ధరల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.
?ఈ పర్యటనలో భాగంగా కూచిపూడి హైస్కూల్‌ను ఆయన సందర్శించిన సమయంలో, అక్కడ మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన చైర్మన్, స్వయంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్యార్థులు కూడా ఆహారం బాగుండటం లేదని చెప్పడంతో తీవ్రంగా పరిగణించిన ఆయన, వెంటనే మద్దిపూడి మండల తహసీల్దార్‌తో ఫోన్లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు.

**త్రిమెన్ కమిటీ ద్వారా తక్షణమే విచారణ చేసి చర్యలు చేపట్టాలి**

ఈ అంశంపై త్రిమెన్ కమిటీ ద్వారా తక్షణమే విచారణ జరిపించి, బాధ్యులైన వంట సిబ్బందిని తొలగించి నూతన వంట వర్గాన్ని నియమించాలని స్పష్టం చేశారు. అనంతరం కూచిపూడిలోని చౌక ధరల దుకాణాన్ని, రావెళ్లవారిపాలెం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కూడా ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు.?ఈ తనిఖీల సందర్భంగా వివిధ ప్రభుత్వ వ్యవస్థల్లో అధికారులు, సిబ్బంది చేపట్టాల్సిన తనిఖీల వివరాలను చైర్మన్ సుదీర్ఘంగా వివరించారు.

**అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార నాణ్యతను పరిశీలించాలి**

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార నాణ్యతను ముఖ్యంగా పరిశీలించాలని సూచించారు. అక్కడ బియ్యం, పప్పులు, గుడ్లు, పాలు, బాలామృతం నిల్వల నమోదు పక్కాగా ఉండాలని, గడువు ముగిసిన సరుకులు లేకుండా చూడడంతో పాటు పిల్లల బరువు, ఎత్తు కొలిచే పరికరాల పనితీరు, కేంద్రాల పరిశుభ్రత మరియు తాగునీటి సదుపాయాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలన్నారు.?

**రేషన్ దుకాణాల్లో ఈ-పోస్ యంత్రాల పనితీరును పరిశీలించాలి**

అదేవిధంగా చౌక ధరల దుకాణాల్లో ఈ-పోస్ యంత్రాల పనితీరును, ఎలక్ట్రానిక్ తారాజుల ప్రామాణికతను నిరంతరం పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం నాణ్యత, బస్తాల బరువు, నిల్వల రికార్డులు మరియు కార్డుదారుల బయోమెట్రిక్ వివరాలను సరిచూసుకోవాలని, కార్డుదారులకు ఎటువంటి అవకతవకలు లేకుండా రాయితీ బియ్యం అందేలా చూడాలని ఆదేశించారు.?

**మెనూ ప్రకారం వేడివేడి నాణ్యమైన భోజనం అందించాలి**

మరోవైపు పాఠశాలలు మరియు సంక్షేమ హాస్టళ్లలో రోజువారీ మెనూ ప్రకారం వేడివేడి నాణ్యమైన భోజనం అందించాలని, వంటశాలల పరిశుభ్రతతో పాటు వంటకు ఉపయోగించే నూనె, పప్పులు, ఐయోడైజ్డ్ ఉప్పు వంటి సరుకులు ఏజీమార్క్ నాణ్యత కలిగి ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు వడ్డించే ముందు ఉపాధ్యాయులు భోజనాన్ని రుచి చూసే ప్రక్రియతో పాటు వంట సిబ్బంది పరిశుభ్రతా నియమాలు పాటిస్తున్నారా లేదా అనేది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి**

కేజీబీవీ మరియు ఇతర సంక్షేమ వసతిగృహాల్లో అల్పాహారం, భోజన నాణ్యత, స్టాక్ రిజిస్టర్లు, డైనింగ్ హాల్స్ మరియు మరుగుదొడ్ల పరిశుభ్రతను కూడా క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.?

**ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదు**

రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన ఆహారంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తోందని చైర్మన్ తెలిపారు. ఈ పథకాల ఫలాలు విద్యార్థులకు నేరుగా అందాలని, ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదివి, సాధారణ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు మరియు ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం పెంచుకుని ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని విజయ్ ప్రతాప్ రెడ్డి ఆకాంక్షించారు.

**సొంత నగదు అందజేత...**

ఈ సందర్భంగా వేమవరం అంగన్వాడీ కేంద్రం లో ఇండక్షన్ స్టవ్,మెటీరియల్ పెట్టుకోవటానికి టేబుల్ ఏర్పాటు కోసం సొంత నగదు 2 వేల రూపాయలు అంగన్వాడీ టీచర్ కి అందించారు. రావెళ్ళవారిపాలెం కేజీబీవీ లో పదవ తరగతిలో 577 మార్కులు సాధించిన విద్యార్థికి 2 వేల రూపాయలు ఇచ్చి మంచి చేతి గడియారం కొనిపించాలన్నారు.

## మంచినీళ్ల కోసం కొట్టుకున్న పాక్ సైనికులు..

**--22 మందికి గాయాలు**



పాకిస్తాన్‌లో సైనికులకు సరిపడా మంచి నీళ్లు కూడా ఇవ్వలేకపోతోంది ప్రభుత్వం. కానీ, బయటకు మాత్రం ఏదో గొప్ప దేశంలాగా ప్రగల్భాలు పలుకుతుంది. అక్కడ సైనికులే మంచి నీళ్ల కోసం కొట్టుకునే పరిస్థితి తలెత్తిందంటే ఆ దేశం పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు.. అక్కడ నీటి కొరత ఎలా వేధిస్తుందో అంచనా వేయవచ్చు.తాజాగా పాకిస్తాన్‌లో రెండు గ్రూపులకు చెందిన సైనికులు మంచి నీటి కోసం పరస్పదం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో 22 మంది సైనికులు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన పాకిస్తాన్‌లోని అప్పర్ సైత్ వజిరిస్తాన్ ప్రాంతంలోని అస్మాన్ మాంజా బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగింది. అక్కడి నీటి పంపిణీ కేంద్రంలో సైనికుల మధ్య ఘర్షణ తలెత్తింది. స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) కమాండోలు, ఫ్రంటియెర్ కార్ప్స్ (ఎఫ్‌సీ) ట్రూప్స్‌కు, ప్లెయిన్ క్లోత్స్ మిలిటరీ ఇంటెలిజెన్స్ పర్సనల్ గ్రూప్‌కు మధ్య ఈ వివాదం నడిచింది. వీరు విధులు నిర్వర్తించే ఈ ప్రాంతంలో తీవ్ర నీటి కొరత ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారానే కొంతకాలంగా నీటి సరఫరా జరుగుతోంది. విధుల్లో ఉన్న ఆయా గ్రూపులకు చెందిన సైనికులు ఈ ట్యాంకర్ల నీటినే వాడుకోవాలి. అయితే, తాజాగా ఒక ట్యాంకర్ వచ్చిన సందర్భంగా ఆ నీటిని తామంటే తామే వాడుకుంటామంటూ ఈ గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఒక గ్రూపు సైనికులు, మరో విభాగపు సైనికులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. పరస్పరం దాడులు చేసుకోవడంతో దాదాపు 22 మంది సైనికులు గాయపడ్డారు. ఈ ఘటనలో గాయపడ్డవారికి అక్కడి ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. అయితే, ఈ ఘటన ద్వారా పాక్ సైనికులు ఎంత క్రమ శిక్షణతో ఉంటారో తేలింది. అలాగే, పాక్ సైన్యంలోని డొల్లతనం, నిధుల లేమి వంటివి కూడా మరోసారి చర్చకు వస్తున్నాయి.

## ప్రధాని సభా ప్రాంగణంలో భద్రతా వైఫల్యం..


**-నకిలీ అధికారి అరెస్ట్, తుపాకీ స్వాధీనం..!**



ప్రధాని నరేంద్ మోడీ ముంబై పర్యటనకు కొన్ని గంటల ముందే కలకలం రేగింది. ప్రధాని సభా ప్రాంగణంలో భద్రతా వైఫల్యం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు ఒక అధికారి, అతడి బాడీగార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయం అధికారిగా ఫోర్జరీ ఐడీ కార్డు కలిగిన వ్యక్తిని, అతడి బాడీగార్డ్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో వీరు అనుమానాస్పందంగా సంచరించడంతో పోలీసులు తనిఖీ చేశారు. దాంతో, ఇద్దరూ దొరికిపోయారు. వీరి నుంచి ఒక తుపాకీ స్వాధీనం చేసుకున్నారు.ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ సభ ఆరంభానికి భద్రతా వైఫల్యం నెలకొంది. ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 ఆవిష్కరణకు ప్రధాని రాక నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు నకిలీ గుర్తింపు కార్డులతో సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని తనిఖీ చేసిన పోలీసులు అనంతరం.. అదుపులోకి తీసుకున్నారు.ప్రధాన మంత్రి కార్యాలయం అధికారిగా నకిలీ ఐడీ కార్డు కలిగిన వ్యక్తిని రోషన్ పరేఖ్‌గా గుర్తించారు. అతడి బాడీగార్డ్ నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఉన్నత స్థాయి భద్రత ఉన్నప్పటికీ వీరిద్దరు నకిలీ ఐడీ కార్డులతో అంత దూరం ఎలా రాగలిగారు? అనే కోణంలో ముంబై నేర విభాగం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నిబంధనలు ఉల్లంఘించినట్లేనా..

**--మెటాను నిలదీసిన సీజేపీ**



తమ పోస్టులను ఇన్‌స్టాగ్రామ్ పదేపదే తొలగించడంపై మెటాపై సీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన నిబంధనలు ఉల్లంఘించినట్లేనా అని మెటాను సీజేపీ ప్రశ్నించింది. దీనిపై తాజాగా సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.తాము చేస్తున్న పోస్టులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నా సరే.. వాటిని మెటా కావాలనే తొలగిస్తోందని దీప్కే ఆరోపించారు. సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చేసిన పలు పోస్టులను ఆ సంస్థ మాతృసంస్థ మెటా తొలగించిన విషయాన్ని ఆయన గుర్తించారు. తమ పోస్టులు ఎక్కువగా ప్రభుత్వాన్ని ప్రశ్నించేవిగానే ఉంటాయని, అవి ఇన్‌స్టాగ్రామ్ కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగానే ఉంటాయన్నారు. ప్రజల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తేనే నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుందా అని మెటాను ఆయన నిలదీశారు. సీజేపీ మరో నేత సౌరవ్ దాస్ కూడా ఇదే అంశంపై మెటాను ప్రశ్నించారు.తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ విషయంలో కూడా మెటా ఇలాగే వ్యవహరిస్తోందన్నారు. తన ఖాతాను మెటా నియంత్రిస్తోందని, పోస్టులను తొలగిస్తోందని, కొన్నిరోజులు పని చేయకుండా చేస్తోందని ఆయన ఆరోపించారు. దిమాగి నక్సల్స్ అంటూ చేసిన పలు పోస్టులను మెటా ఇటీవల తొలగించింది. సెన్సిటివ్ కంటెంట్ అంటూ తొలగించింది. దీనిపైనే మెటా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వ ఒత్తిడికి లొంగవద్దని కోరింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# చిరంజీవి 'కాకా'లో అనస్వర రాజన్..

## - ఎంబీబీఎస్ స్టూడెంట్‌గా ఫస్ట్ లుక్ అదిరింది!




మలయాళం ఇండస్ట్రీలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక అనస్వర రాజన్ ఇప్పుడు తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా మారుతోంది. ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతున్న ఈ మలయాళీ బ్యూటీ.. తాజాగా మరో తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో టాలీవుడ్‌లో ఆమె జోరు మరింత పెరిగినట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం అనస్వర రాజన్ చేతిలో ఉన్న ప్రాజెక్టుల్లో 'కాకా' మాత్రం ఆమె కెరీర్‌లోనే అత్యంత కీలకమైన చిత్రంగా నిలవనుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ భారీ సినిమాలో అనస్వర ఓ కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్రపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది.అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో అనస్వరను ఎంబీబీఎస్ విద్యార్థిని అమ్ములుగా పరిచయం చేశారు. చాలా సహజమైన, హోమ్లీ లుక్‌లో కనిపిస్తున్న ఆమె ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సాధారణ గ్లామర్ లుక్‌కు భిన్నంగా.. ఓ మెడికల్ స్టూడెంట్‌గా అనస్వరను చూపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆమె పాత్ర సినిమాకు కథాపరంగా ఎంత ముఖ్యమో పోస్టర్‌లోనే హింట్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అనస్వర వెనుక భాగంలో నీడలా కనిపిస్తున్న చిరంజీవి పాత్ర.. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య ఉన్న బంధంపై ఆసక్తిని పెంచుతోంది.'కాకా' సినిమాలో అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రి-కూతుళ్ల అనుబంధం సినిమాకు కీలకమైన ఎమోషనల్ పాయింట్‌గా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఫస్ట్ లుక్‌లో చిరంజీవిని నేరుగా చూపించకుండా ఆయన నీడను మాత్రమే హైలైట్ చేయడం ద్వారా.. అమ్ములు జీవితంలో ఆయన పాత్ర ఎంత కీలకమో చెప్పే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. దీంతో సినిమాలో అనస్వర పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథలో బలమైన ప్రాధాన్యత కలిగి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మలయాళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన అనస్వర రాజన్.. ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులను దక్కించుకుంటోంది. ఇప్పటికే ఆమె నటించిన తెలుగు చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంటుండగా.. తాజాగా 'అంతా రాములోరు చూసుకుంటారు' చిత్రానికి కూడా సైన్ చేసింది.దీంతో తెలుగులో ఆమె చేయబోయే సినిమాల సంఖ్య నాలుగుకు చేరినట్లు తెలుస్తోంది. అయితే వీటిలో 'కాకా' మాత్రం భారీ స్టార్ హీరోతో కలిసి నటిస్తున్న కారణంగా ఆమె కెరీర్‌కు మరింత కీలకంగా మారనుంది.మెగాస్టార్ చిరంజీవి వంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం రావడం అనస్వరకు పెద్ద ప్లస్‌గా మారనుంది. ముఖ్యంగా తండ్రి-కూతుళ్ల బంధం చుట్టూ కథనం సాగితే.. ఆమె నటనకు మంచి స్కోప్ ఉండే అవకాశం ఉంది.

# సెన్సార్ పూర్తి చేసుకున్న సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'.!

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో సుమంత్ నటిస్తున్న తాజా చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఎ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. ఈ చిత్రంలో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి, ఐశ్వర్య రాజేష్ మరియు మాళవికా నాయర్ నటిస్తుండగా, వెన్నెల కిషోర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అప్పా రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రాగమయూరి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిప్స్ బ్యానర్‌లపై మధు కాలిపు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.




# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఓటీటీ రిలీజ్ ఫిక్స్.

## - నెట్‌ఫ్లిక్స్‌లో ఈ తేదీ నుంచి స్ట్రీమింగ్!




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. తమిళంతో పాటు తెలుగులోనూ మంచి మార్కెట్, భారీ ఫాలోయింగ్ ఉన్న సూర్య.. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తన సినిమాల పరిధిని మరింత పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. ఆగస్టులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. ముఖ్యంగా కథలోని భావోద్వేగ అంశాలు, కుటుంబ అనుబంధాలను దర్శకుడు తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకున్నట్లు టాక్ వచ్చింది.విశ్వనాథ్ అండ్ సన్స్' థియేట్రికల్ రన్ దాదాపుగా పూర్తవుతున్న నేపథ్యంలో.. ఇప్పుడు డిజిటల్ రిలీజ్‌పై అధికారికంగా క్లారిటీ వచ్చింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.తాజా సమాచారం ప్రకారం సెప్టెంబర్ 11 నుంచి 'విశ్వనాథ్ అండ్ సన్స్' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. దీంతో థియేటర్లలో సినిమాను మిస్ అయిన ప్రేక్షకులతో పాటు మరోసారి కుటుంబ సమేతంగా ఈ ఎమోషనల్ డ్రామాను చూడాలనుకునే వారికి ఓటీటీ ద్వారా అవకాశం లభించనుంది. ఓటీటీ రిలీజ్ విషయంలోనూ మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా కేవలం ఒరిజినల్ తమిళ భాషలో మాత్రమే కాకుండా పలు డబ్బింగ్ వెర్షన్లలోనూ అందుబాటులోకి రానుంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా 'విశ్వనాథ్ అండ్ సన్స్'ను ప్రేక్షకులు వీక్షించవచ్చు. దీంతో ఈ సినిమా రీచ్ మరింత విస్తరించే అవకాశం ఉంది. ప్రత్యేకంగా తెలుగు ప్రేక్షకులకు కూడా సినిమా అందుబాటులోకి రానుండటంతో.. సూర్య అభిమానులతో పాటు వెంకీ అట్లూరి సినిమాలను ఇష్టపడే ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది.'విశ్వనాథ్ అండ్ సన్స్'లో సూర్య, మమితా బైజు జోడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇచ్చిన కథలో వీరి పాత్రలు కథనానికి అనుగుణంగా సాగుతాయని తెలుస్తోంది.ముఖ్యంగా సూర్య తన స్టార్ ఇమేజ్‌కు భిన్నంగా ఎమోషనల్ టచ్ ఉన్న పాత్రలో కనిపించడం సినిమాకు ప్రత్యేకతగా నిలిచిందనే టాక్ వినిపించింది. మరోవైపు మమితా బైజు కూడా తన పాత్రకు తగినట్లుగా నటించి ఆకట్టుకున్నట్లు ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది.

# మరో మల్టీప్లెక్స్‌ను ప్లాన్ చేస్తున్న విజయ్ దేవరకొండ..


## హైదరాబాద్‌లో ఏర్పాటుపై కసరత్తు!

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ సినిమా థియేటర్ల వ్యాపారాన్ని విస్తరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అల్లు అర్జున్, మహేశ్ బాబు, రవితేజ వంటి అగ్ర కథానాయకులు రెండేసి మల్టీప్లెక్స్‌లతో తమ వ్యాపారాన్ని విస్తరిస్తుండగా తాజాగా అదే బాటలో రౌడీ హీరో కూడా నడవబోతున్నట్లు తెలుస్తుంది. ఏషియన్ గ్రూప్‌తో కలిసి ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో 'ఏవీడీ సినిమాస్' పేరుతో ఒక అత్యాధునిక మల్టీప్లెక్స్‌ను నిర్వహిస్తున్న ఆయన, ఇప్పుడు మరో కొత్త మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.నార్త్ హైదరాబాద్‌లోని ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని మేడ్చల్ లేదా మల్కాజ్‌గిరి ప్రాంతంలో ఈ కొత్త మల్టీప్లెక్స్‌ను నిర్మించాలని ఆయన యోచిస్తున్నట్లు సినీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, ఈ ప్రణాళిక ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని, త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.



# యష్ 'టాక్సిక్'కు ఓటీటీ షాక్..

## రూ.150 కోట్ల ఆఫర్ నుంచి రూ.30 కోట్లకు పడిపోయిందా?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్ 2' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత యష్ నటించిన సినిమా కావడంతో ఈ మూవీపై దేశవ్యాప్తంగా భారీ హైప్ ఏర్పడింది. అయితే థియేటర్లలో మాత్రం సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయిందనే టాక్ వచ్చింది. ఇప్పుడు అదే ప్రభావం 'టాక్సిక్' డిజిటల్ రైట్స్‌పై పడినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు భారీ మొత్తంలో ఓటీటీ సంస్థలు ఆఫర్లు ఇచ్చినప్పటికీ.. సినిమా ఫలితం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందనే వార్తలు వినిపిస్తున్నాయి.టాక్సిక్'పై విడుదలకు ముందు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం సుమారు రూ.150 కోట్ల ఆఫర్ చేసినట్లు సమాచారం. యష్ క్రేజ్‌తో పాటు సినిమాకు ఉన్న భారీ బజ్, టీజర్‌లో కనిపించిన బోల్డ్ కంటెంట్, స్టార్ హీరోయిన్ల గ్లామర్ వంటి అంశాలు ఈ ఆఫర్‌కు కారణమని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఈ ఆఫర్‌ను మేకర్స్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. థియేటర్లలో సినిమా భారీ విజయం సాధిస్తే డిజిటల్ రైట్స్ విలువ మరింత పెరిగి రూ.200 కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందని భావించినట్లు టాక్. కానీ బాక్సాఫీస్ ఫలితం అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు లెక్కలు పూర్తిగా మారిపోయినట్లు తెలుస్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం 'టాక్సిక్' డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ కోసం జీ5 సుమారు రూ.30 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. విడుదలకు ముందు వచ్చిన రూ.150 కోట్ల ఆఫర్‌తో పోలిస్తే ఇది చాలా తక్కువ మొత్తం. అంటే సినిమా విడుదలకు ముందు ఉన్న అంచనాలు, విడుదల తర్వాత వచ్చిన ఫలితం ఓటీటీ మార్కెట్‌పై ఎంత ప్రభావం చూపించాయో ఈ సంఖ్యలు చెబుతున్నాయని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే రూ.150 కోట్ల ఆఫర్, రూ.30 కోట్ల ప్రస్తుత ఆఫర్‌కు సంబంధించిన వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అందువల్ల ఇవి ప్రస్తుతం మీడియా, ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారంగానే చూడాల్సి ఉంటుంది. పాన్ ఇండియా సినిమాలకు థియేట్రికల్, ఓటీటీతో పాటు శాటిలైట్ రైట్స్ కూడా కీలక ఆదాయ వనరుగా ఉంటాయి. అయితే 'టాక్సిక్' విషయంలో 'ఎ' సర్టిఫికెట్ కంటెంట్ కారణంగా టెలివిజన్ ప్రసారానికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465